epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 117 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 24 ఫిబ్రవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## టీటీడీ నిబంధనలు మరింత కఠినతరం

- కల్తీ నెయ్యిపై సీఎం కీలక ప్రకటన
- రేపు అసెంబ్లీలో 4 గంటలపాటు చర్చ
- సీఎం చంద్రబాబును అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో కలిసిన మంత్రులు 3
- అన్యమతస్థులకు డిక్లరేషన్ నిబంధన మరింత కఠినతరం చేయాలనే అంశంపై చర్చ



**అమరావతి:** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రేపు (మంగళవారం) ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలతో నెయ్యి కల్తీపై చర్చించాలని నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును మంత్రులు కలిశారు. అన్యమతస్థులకు డిక్లరేషన్ నిబంధన మరింత కఠినతరం చేయాలనే అంశంపై చర్చించారు. తిరుమల శ్రీవారి ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యిలో రసాయనాల మిశ్రమంపై శాసనసభలో మంగళవారం 4 గంటల పాటు చర్చ జరగనుంది. మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల అనంతరం జీరో అవర్ రద్దు చేసి ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు కల్తీ నెయ్యిపై చర్చించాలని నిర్ణయించారు. నెయ్యి కల్తీపై కూటమి ఎమ్మెల్యేలతో మాట్లాడించాలని నిర్ణయం తీసుకున్నారు. స్వల్ప అస్వస్థత కారణంగా డిప్యూటీ సీఎం పవన్

మిగతా 5 లో





# సర్కారీ మెట్రో!

## ఎల్అండ్‌టీ నుంచి పూర్తిగా స్వాధీనం.. విస్తరణకు తొలగనున్న అడ్డంకులు

- స్వాధీన ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం
- మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి నిర్ణయం
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్
- ఖమ్మం జిల్లాలో టీటీడీ నిర్మాణాలకు 20 ఎకరాలు
- గుమ్మడూరులో జేఎన్‌టీయూకు 70 ఎకరాలు
- మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 :** హైదరాబాద్ మెట్రో రైలును ఎల్అండ్‌టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవేశ పెడతారు. దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది.

మిగతా 2 లో

## ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

23 నుంచి ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులకు అవకాశం
మే 12న పరీక్ష

.. వివరాలు 2లో



## నా పేరుతో సంస్థల్లేవ్!

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం

.. వివరాలు 2లో



## సరోగసి అక్రమాలపై విచారణ

ఈడీ కస్టడీకి డాక్టర్ నమ్రత 2

కోర్టు ఆదేశాలతో విచారణకు సిద్ధం

## వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

సేవలను సులభంగా చేయాలన్న లక్ష్యం 2








# రాహుల్ ప్రధాని అయితేనే..

## దేశంలోని సమస్యలకు పరిష్కారం

- రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు దక్కేలా కృషి
- స్థానాల గెలుపే లక్ష్యంగా డీసీసీ అధ్యక్షులు పనిచేయాలి
- కుల గణనతో సామాజిక న్యాయం..
- కాంగ్రెస్ ముక్త భారత్ కుట్రలను తిప్పికొడదాం
- డీసీసీల శిక్షణాశిబిరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**వికారాబాద్, ఫిబ్రవరి 23:** రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు. వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న

మిగతా 2 లో

## పలు జిల్లాల్లో వడగళ్ల వాన

పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

పంటలకు తీవ్రనష్టం.. ఆందోళనలో రైతులు



బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భాగ్యనగరంలో పలుచోట్ల వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపం చూపినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మబ్బుపట్టి చల్లని గాలులు వీచడంతో నగరంలో ఆహ్లాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. చాలా రోజుల తర్వాత కురిసిన చిరు జల్లులు భాగ్యనగరాన్ని మురిపించాయి. ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్న తరుణంలో హైదరాబాద్ నగర ప్రజలను వరుణుడు పలకరించాడు. 2

## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం 4





## మరోమారు పెరిగిన బంగారం ధరలు

అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతారామన్

సోమవారం వెండి ధర కిలోకు రూ.15,000 పైగా పెర గగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగ బాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు, వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. 4

## బంగ్లాదేశ్‌లో మరో దారుణం

హిందూ దివ్యాంగురాలిపై సామూహిక లైంగికదాడి

బంగ్లాదేశ్‌లో తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. చాంద్‌పుర్ జిల్లాలో హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు.



4




# వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

**సేవలను సులభంగా చేయాలన్న లక్ష్యం**

**టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించినట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి, సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్‌లకు వాట్సాప్ చాట్‌బాట్ చెక్ పెడుతుందన్నారు సీఎండీ. విద్యుత్ సరఫరాలో ఫిర్యాదుల నమోదుతో పాటు బిల్లు జారీచేయకపోయినా, ఆన్‌లైన్ బిల్లు చెల్లించాక ఆ సమాచారం అప్డేట్ కాకపోయినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏవైనా సమస్యలు తలెత్తినా, విద్యుత్ లైన్లకు చెట్లకొమ్మలు తగిలినా, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా.. ఇలా పలురకాల ఫిర్యాదులను వాట్సాప్ చాట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

# జాతరలో అమానుష ఘటన

**చర్యలు తీసుకోవాలని డిజిపికి ఫిర్యాదు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** కుమ్మేరా జాతరలో అమానుష ఘటనపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలోకి వెళ్లి డీజీపీ శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అగ్రకులానికి చెందిన నాయకుడు రజక కులానికి చెందిన రెండు నెలల పసికందును తన్ని చంపిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిజాలు వెలికితీయాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిషోర్ గౌడ్, ఉపేందర్ చారి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు యాదవ్, నేతలు స్వామి యాదవ్ ,రాజు తదితరులున్నారు.

# కలుషిత ఆహారం పెట్టారంటూ విద్యార్థుల ఆందోళన

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** రాష్ట్రంలో ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ పాఠశాలల పరిస్థితితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. నాణ్యత లేని, కలుషిత ఆహారం పెడుతున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచుగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలతో వందలాది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై దవాఖానల పాలవుతున్నారు. ఇటీవలే నాగర్‌కర్నూల్ సంఘటన మరవకముందే జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడురు గిరిజన బాలికల వసతి గృహంలో విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. కలుషిత ఆహారం పెడుతున్నారని ఆరోపిస్తూ తరగతులు బహిష్కరించి రోడ్డెక్కారు. మంచి ఆహారం పెట్టి, కనీస వసతులు కల్పించాలని, ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు.

# ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

**23 నుంచి ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులకు అవకాశం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** తెలంగాణ రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రతిష్టాత్మక టీజీ ఎడ్‌సెట్-2026 నోటిఫికేషన్‌ను వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఈ ఏడాది పరీక్ష నిర్వహణ బాధ్యతలను స్వీకరించిన కేయూ, దరఖాస్తుల పక్రియ నుంచి ఫలితాల విడుదల వరకు పూర్తి షెడ్యూల్‌ను ఖరారు చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 23వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా, అభ్యర్థులు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము చెల్లించకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. గడువు ముగిసిన తర్వాత కూడా అభ్యర్థుల సౌకర్యార్థం అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును అధికారులు కల్పించారు. రూ. 250 ఫైన్‌తో ఏప్రిల్ 23 వరకు, రూ. 500 ఫైన్‌తో ఏప్రిల్ 27 వరకు, రూ. 1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తులను అనుమతించనున్నారు. ఇక పరీక్షా నిర్వహణ విషయానికి వస్తే, మే 12వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థుల సంఖ్యను బట్టి ఉదయం , సాయంత్రం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. పరీక్ష పూర్తయిన మూడు రోజుల్లోనే అంటే మే 15న అధికారులు ప్రాథమిక కీని విడుదల చేస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించిన అనంతరం, మే 30వ తేదీన తుది ఫలితాలను వెల్లడించనున్నారు. బీఈడీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి.

# నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు: కేటీఆర్




**హైదరాబాద్,ఫిబ్రవరి 23:** తన పేరుతో ఎలాంటి సంస్థలు లేవని, అలా సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. కొంతమంది 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' లాంటి పేర్లతో సంస్థలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు చేపడుతున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు. 'నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు. అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోం' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా సేవా దృక్పథంతో పనిచేయాలనుకుంటే కచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

# మెట్రో ఇక సర్కారు సొంతం

మొదటి పేజీ తరువాయి

ఇకపోతే మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్‌అండ్‌టీకి చెల్లించేలా.. రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన పక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ.15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ.13,000 కోట్లు కాగా, ఎల్‌అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ.2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరు లో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన పక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జన గణన పక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. చీఫ్ సెక్రెటరీ ఈ పక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరిస్తూ, మే 11వ తేదీన ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ హౌజ్ లిస్టింగ్ పక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశిరచిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యుమరేటర్లను, వారికి దిశానిర్దేశర చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, రెండో దశ జనగణన వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, లోపాలు లేకుండా ఈ పక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# రాహుల్ ప్రధాని అయితేనే దేశంలోని సమస్యలకు పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమం లో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ఃఐ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరానితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు.స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరాని తనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సరోగసి అక్రమాలపై విచారణ

**ఈడీ కస్టడీకి డాక్టర్ నమ్రత**

**కోర్టు ఆదేశాలతో విచారణకు సిద్ధం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** సృష్టి సరోగసీ అక్రమాల కేసులో అరెస్టైన డాక్టర్ నమ్రతపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో మరింత వేగం పెరిగింది. ఈ కేసులో డాక్టర్ నమ్రతను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం రెండు రోజుల పాటు ఈడీ కస్టడీలో విచారణ జరగనుంది. ఈ కేసు సరోగసీ పేరుతో అక్రమాలు, హవాలా, మనీలాండరింగ్ ఆరోపణలతో సంబంధం ఉండటంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. డాక్టర్ నమ్రతను ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోర్టును కోరింది. అయితే కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. రెండు రోజుల పాటు మాత్రమే కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ఈడీ అధికారులు డాక్టర్ నమ్రతను తమ కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో కేసుకు సంబంధించిన కీలక అంశాలను వెలికితీసే ప్రయత్నం చేయనున్నారు. డాక్టర్ నమ్రతపై సరోగసీ సేవల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. చట్టబద్ధమైన విధానాలను పాటించకుండా, అక్రమంగా సరోగసీ వ్యవస్థను ఉపయోగించి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలు కీలక ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఈ కేసులో ముఖ్యంగా హవాలా, మనీలాండరింగ్ అంశాలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. డాక్టర్ నమ్రత భారీ మొత్తంలో డబ్బు సేకరించి, హవాలా మార్గం ద్వారా విదేశాలకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డబ్బు లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు, విదేశీ సంబంధాలు వంటి అంశాలపై ఈడీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టనున్నారు. ఈడీ కస్టడీ విచారణలో.. అక్రమంగా సేకరించిన డబ్బు తరలింపు మార్గాలు, ఇందులో పాల్గొన్న ఇతర వ్యక్తులు, విదేశీ సంబంధాలు వంటి అంశాలపై కీలక సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కేసులో మరికొందరు వ్యక్తులు కూడా ఉన్నారా అన్న దానిపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సరోగసీ వ్యవస్థను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడం సమాజంలో ఆందోళన కలిగిస్తోంది. ఈ కేసు ద్వారా అక్రమంగా జరుగుతున్న కార్యకలాపాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయ మయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.

# కామారెడ్డిలో తగ్గని ఉద్రిక్తత

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి అస్వస్థత
- పరీక్షించిన వైద్యులు.. రెస్ట్ తీసుకోవాలని సూచన



**కామారెడ్డి, ఫిబ్రవరి 23:** ఓవైపు కామారెడ్డిలో ఉద్రిక్తత కొనసాగుతున్న వేళ,కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణారెడ్డి సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత రెండు మూడు రోజులుగా కామారెడ్డి లో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల ఒత్తిడి నేపథ్యంలో ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన పోలీసుల బందోబస్తు నడుమ గృహ నిర్భంధంలో ఉండగా.. డాక్టర్లు ఆయన ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో భూ వివాదానికి సంబంధించి జరుగుతున్న గొడవ.. సవాళ్లు, ప్రతి సవాళ్లకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆరోగ్యంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. అయితే మరికొన్ని రోజుల పాటు ఆయనకు విశ్రాంతి అవసరమని సూచించారు. ఇదిలావుంటే కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య సవాళ్ల నేపథ్యంలో స్థానికంగా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. సోమవారం జిల్లా కలెక్టర్‌తో బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి భేటీ కావాలనుకున్నారు. తనపై చేసిన ఆరోపణల నేపథ్యంలో అందుకు సంబంధించిన సాక్ష్యాలు తీసుకురావాలంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను కాంగ్రెస్ నేతలు స్వీకరించారు. అందుకు సంబంధించిన సాక్ష్యాలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. మరోవైపు డిగ్రీ కాలేజీ భూముల విషయంలో తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని వెంకట రమణారెడ్డి ప్రకటించిన విషయం విదితమే. రాజీనామాకు సిద్ధం కావాలంటూ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములపై స్పష్టత ఇవ్వాలంటూ అధికారులను బీజేపీ డిమాండ్ చేసింది. ఇలా ఇరు పార్టీనేతల విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడంతో కామారెడ్డిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేపథ్యంలో పోలీసులు వెంటనే అలర్ట్ అయ్యారు. ఇరు పార్టీల నేతలను కలెక్టర్ కార్యాలయానికి పోలీసులు వెళ్లనిస్తారా? లేదా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యేకు మద్దతుగా కామారెడ్డి వెళ్లేందుకు యత్నించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావును పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కామారెడ్డి వెళ్తుండగా.. ఆయన్నూ పెద్దశంకర్‌పేట వద్ద అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే.

# గౌరవెల్లి ప్రాజెక్టు అడ్డంకులు తొలగిస్తాం

- లీగల్ చిక్కుల వల్లే జాప్యం.. బుధవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. నిధుల విడుదలకు హామీ..
- మూడు జిల్లాల కలెక్టర్లతో సచివాలయంలో సమీక్ష



**హైదరాబాద్, ఫిబ్రవరి 23 :** తెలంగాణలోని కీలకమైన గౌరవెల్లి ప్రాజెక్టును అన్ని విధాలా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన ఈ ప్రాజెక్టుపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆలస్యానికి గల కారణాలు, ముఖ్యంగా న్యాయపరమైన ఇబ్బందులపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగవంతం కావాలంటే భూసేకరణ ప్రక్రియ పూర్తి కావాలని, దానికి అడ్డుగా ఉన్న లీగల్ సమస్యలను క్లియర్ చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. "ఈ ప్రాజెక్టుకు సంబంధించి బుధవారం సుప్రీంకోర్టులో ఎన్విరాన్‌మెంట్ కేసు విచారణ ఉంది. సర్వోన్నత న్యాయస్థానంలో మాకు అనుకూలంగా తీర్పు వస్తుందనే పూర్తి విశ్వాసం ఉంది" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రాజెక్టు కోసం నిరంతరం ఒత్తిడి తెస్తున్నారని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా భూసేకరణకు అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ (ఏజీ), ఇరిగేషన్ అధికారులతో జరిగిన ఈ సమావేశంలో కాలువల భూసేకరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేవాదుల ప్రాజెక్టు నీళ్లు హుస్నాబాద్ నియోజకవర్గానికి చేరేలా పెండింగ్‌లో ఉన్న పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో పాటు సంబంధిత ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

- విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ
- జీఎంఆర్,ఫిక్కీ సంస్థలతో ఒప్పందం
- ఉపాధి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్న సీతక్క



**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, గ్రౌండ్ హ్యాడ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్షంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్టీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహాగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం–పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్

**కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ తీవ్ర విమర్శలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల మొత్తం ప్రక్రియను ఒక రాజకీయ డ్రామాగా మలిచారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీల అభివృద్ధిపై సీఎం ఒక్క రోజైనా స్పష్టమైన ప్రకటన చేయలేదని సంజయ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న ప్రజాప్రతినిధిగా, రాజ్యాంగ పరిరక్షణ తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావుకు సిట్ నోటీసులు ఇవ్వడం ద్వారా మొదటి రాజకీయ నాటకానికి తెరలేపారని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పష్టత లేకపోయినా, తెలంగాణ జాతిపితగా పేర్కొన్న కే. చంద్రశేఖర్ రావుకు నోటీసులు జారీ చేయడం రెండో డ్రామా అని సంజయ్ ఆరోపించారు. ప్రజల దృష్టి మళ్లించడంలో సీఎం తనకే సాటి అని విమర్శించారు. దావోస్ పర్యటనపై స్పందిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 12 రోజుల పాటు దావోస్లో గడిపి, రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై స్పష్టత ఇవ్వలేదని అన్నారు. పెట్టుబడుల అంశంపై మంత్రి శ్రీధర్ బాబు కూడా మాట్లాడలేదని విమర్శించారు. అందువల్ల ఆ పర్యటనను విహార యాత్రగా భావిస్తున్నామని వ్యాఖ్యానించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉన్నప్పుడు మున్సిపాలిటీల్లో సభలు, మున్సిపల్ ఎన్నికలు ఉన్నప్పుడు గ్రామాల్లో సభలు నిర్వహిస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇతర పార్టీలతో సంబంధాలు ఉన్నది కాంగ్రెస్‌నే కానీ, బీఆర్ఎస్‌పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలకు తగిన నిధులు కేటాయించకపోతే ప్రజలు కాంగ్రెస్‌కు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. జలవనరుల అంశంపై చర్చకు సిద్ధమని, ముఖ్యంగా దేవాదుల ప్రాజెక్టు మరియు కాళేశ్వరం ప్రాజెక్టులపై సమగ్ర చర్చ జరగాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు 'శ్రీరామ రక్ష' వంటిదని పేర్కొన్న సంజయ్, దాని మరమ్మతులు తప్పనిసరిగా చేపట్టాలని అన్నారు. అసెంబ్లీని గౌరవించి ప్రతిపక్షానికి మైక్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మారిన ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్‌పై అనర్హత వేటు వేయగా, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం చేసిన పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కూడా ఎలాంటి చర్యలు లేవని ఆరోపించారు. మొత్తంగా, మున్సిపల్ ఎన్నికల ముగింపు వరకు అభివృద్ధి అంశాలను పక్కన పెట్టి వ్యక్తిగత విమర్శలకే పరిమితమవుతున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.



# జిల్లా జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ

**మాజీమంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ భేటీ**

**బెయిల్ పిటిషన్‌పై వాదనలు నేటికి వాయిదా**

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 23:** ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని, జైలులో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు బయట వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 14 మంది గెలిచినా మంత్రి వివేక్ అధికార దౌర్జన్యంతో ఎన్నికలను నిలిపివేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేసి బీఆర్ఎస్ నాయకులపైనే కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. సుమన్ పై ఉన్న పాత కేసులు తోడి బెయిల్ రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దౌర్జన్యంగా క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. అధికార పార్టీ దౌర్జన్యాలను అడ్డుకుంటామని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏనాడు ఇలాంటి చర్యలకు పాల్పడలేదని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ దురాగతాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. జైలులో అధికారులు సుమన్‌ను మానసిక శోభకు గురి చేస్తున్నారని, దోమలు బాగా ఉన్న పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి తెలిపారు. కొంత అనారోగ్యానికి గురైన వైద్యం అందించడం లేదని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఇదిలావుంటే రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బెయిల్ పిటిషన్ పై వాదనలను కోర్టు నేటికి వాయిదా వేసింది. జిల్లా జైలులో ఉన్న బాల్కసుమన్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణకు రాగా కోర్టు పరిశీలించింది. కౌంటర్ పిటిషన్ పై గడువు కావాలని పోలీసులు కోరగా బెయిలు పిటిషన్ పై వాదనలను రేపటికి వాయిదా వేసింది. జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించింది. పోలీసులను, ప్రభుత్వాన్ని నిలదీసిన బాల్కసుమన్‌పై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది . గత వారం రోజులకు పైగా సుమన్ మంచిర్యాల జిల్లా జైలులో ఉన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు బంద్ నిర్వహించాయి.



# కేజీబీవీ బెడ్స్ టెండర్లలో 100 కోట్ల కుంభకోణం

**లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్వీ నేత గెల్లు శ్రీనివాస్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** కేజీబీవీ బంకర్ బెడ్స్ టెండర్లలో జరిగిన రూ.100 కోట్ల కుంభకోణంపై వెంటనే సీబీఐ విచారణ జరపాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంభకోణం విషయంలో ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం లో చలనం లేదని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అవినీతి అడ్డుకట్టలేకుండా కొనసాగుతోందని విమర్శించారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ విద్యార్థులు చదువుకునే కేజీబీవీ పాఠశాలల్లో మౌలిక వసతుల పేరుతో ఈ టెండర్లలో భారీ అవినీతి జరిగిందని పేర్కొన్నారు .నాసిరకం బంకర్ బెడ్స్ సరఫరా చేసి టెండర్లలో నియమ నిబంధనలను ఉల్లంఘించి ట్రూఫా , ముఫత్లాన్ కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ. 12 వేల ఒక బెడ్డును లోకల్ ఎంఎస్ఎంఈలకు లకు లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో టెండర్‌లో భాగస్వామ్యం చేసారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అదే బెడ్డును రూ. 35 వేలకు మధ్యప్రదేశ్ నుంచి కొనుగోలు చేస్తూ ఒక్కో బొడ్డుపై 22 వేల రూపాయలను ఎస్టీమేషన్ కాస్ట్ పెంచి కాంట్రాక్టర్‌కు లబ్ది చేకూర్చారని ఆరోపించారు. మొత్తం 45,360 బెడ్‌లకు గాను ఒక్కో బెడ్డుకు రూ. 33,446 అందజేస్తున్నాని, దాదాపుగా రూ. 164 కోట్ల రూపాయలను ఢిల్లీలో రాహుల్ గాంధీకి చేరవేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కుంభకోణంపై వెంటనే సీబీఐతో న్యాయ విచారణ జరపాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

## హౌజింగ్ బోర్డు భూములకు రెక్కలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న హౌసింగ్ బోర్డు భూములు అధిక ధరలు పలికాయి. గచ్చిబౌలి, భౌరంపేట్, బాలాజీ నగర్, చింతల్ తదితర ప్రాంతాల్లోని మొత్తం 14 స్థలాలను బహిరంగ వేలం వేశారు. వీటిలో గచ్చిబౌలిలోని భూమి చదరపు గజం రూ.1.76 లక్షలు, కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో చదరపు గజం రూ.1.64 లక్షలు పలికింది. బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.34.27 కోట్ల ఆదాయం సమకూరింది. కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ వేలంలో 50 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.



సంపాదకీయం

# మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలి!

**రాష్ట్రాల్లో మాదకద్రవ్యాల రవాణా, వినియోగం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. అడపాదడపా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు పట్టుబడుతున్నప్పటికీ... అది సమస్య తీవ్రతను తగ్గించలేకపోతుంది. చాపకింద నీరులా ఈ వ్యాపారం విస్తరిస్తూ యువతను బలితీసుకుంటోంది. 2003-2013 మధ్య రూ.40 వేల కోట్ల విలువైన 26 లక్షల కిలోల మాదకద్రవ్యాలు పట్టుబడితే, 2014-2025 మధ్య రూ.1.65 లక్షల కోట్ల విలువైన కోటి కిలోల మాదకద్రవ్యాలు స్వాధీనం కావడం సమస్య విస్తృతిని సూచిస్తోంది. దొరికినవి ఇంతైతే, వినియోగంలో ఉన్న పరిమాణం ఎంత ఉంటుందో ఊహించవచ్చు.**

తెలుగు రాష్ట్రాల్లో మాదకద్రవ్యాల విచ్చలవిడి రవాణా, వినియోగం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. అడపాదడపా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు పట్టుబడుతున్నా, అది మంచుకొండ కొన మాత్రమేనని తాజా గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. 2014 నుండి 2025 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా రూ. 1.65 లక్షల కోట్ల విలువైన కోటి కిలోల మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయంటే, ఇక పట్టుబడకుండా సమాజంలోకి ప్రవహిస్తున్న మత్తు ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. అందమైన భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన విద్యార్థులు, యువత ఈ ఊబిలో చిక్కుకుని తమ జీవితాలను బుగ్గి చేసుకుంటున్నారు.

### మృగాలకంటే హీనంగా మారుస్తున్న మత్తు

మత్తు మనిషిలోని విచక్షణను హరించివేస్తోంది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బాలికపై జరిగిన హత్యాచార దుర్మార్గం, నెల్లూరులో ప్రజా కళాకారుడు పెంచలయ్య హత్య, నిజామాబాద్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య బలి.. ఇవన్నీ మత్తు మత్తులో జరిగిన దారుణాలే. గంజాయికి అలవాటు పడ్డ ముఠాలు సామాజిక కట్టుబాట్లను, నాగరిక విలువలను కాలదన్ని మృగాలకంటే హీనంగా ప్రవర్తిస్తున్నాయి. రాజకీయ దన్నుతో విర్రవీగుతున్న ఈ ముఠాలను ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నుంచి వెలివేసినప్పుడే ఈ గంజాయి సామ్రాజ్యం నశించిపోతుంది.

**మాదకద్రవ్యాలు కేవలం ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, మనిషి విచక్షణను కూడా హరించేస్తాయి. మత్తులో జరిగే హత్యలు, అత్యాచారాలు, దాడులు పెరుగుతున్నాయి. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. సమాజంలో భయం పెరుగుతోంది. నేరాల వెనుక మత్తు ప్రభావం ఉన్న అనేక ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి.**

### ఉపాధి పేరిట విషవలయం

నిరుద్యోగం కూడా ఈ రవాణాకు ఒక కారణంగా మారింది. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశతో యువత ఈ ఉచ్చులో దిగుతున్నారు. ముఖ్యంగా నైజీరియన్లు వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్టవేసి మత్తు వ్యాపారం సాగిస్తుండటం గమనార్హం. వీరిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నిఘా వర్గాలపై ఉంది. స్కూలు స్థాయి నుంచే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, కాలేజీల్లో నిఘా పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ప్రభుత్వాలకు సవాల్.. కార్యాచరణే పరిష్కారం:

కేవలం జైల్లో వేయడం వల్లనో, నిందితులు ఆత్మహత్యలు చేసుకోవడం వల్లనో ఈ సమస్య పరిష్కారం కాదు. మాదకద్రవ్యాల రవాణాను కూకటివేళ్లతో సహా పెకలించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 'ఆపరేషన్' చేపట్టాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఒక ఖచ్చితమైన కార్యాచరణను రూపొందించాలి. యువతను కాపాడుకోవడానికి ఎంత కఠినమైన నిర్ణయాలకైనా వెనకాడకూడదు. మత్తు బానిసలను బయటకు తెచ్చే వైద్యానికే దేశంలో ఏటా రూ. 15 వేల కోట్లు ఖర్చవుతున్న ఈ తరుణంలో, నివారణే ప్రథమ చికిత్సగా భావించి మాదకద్రవ్యాలపై సంపూర్ణ యుద్ధం ప్రకటించాలి.



# అమెరికాలో సుంకాల విధింపు నిలిపివేత

- సుప్రీం తీర్పుతో దిగొచ్చిన ట్రంప్ సర్కార్!
- మంగళవారం నుంచి వసూళ్లు బంద్
- కస్టమ్స్ శాఖ అధికారిక ప్రకటన



**వాషింగ్టన్, ఫిబ్రవరి 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అంతర్జాతీయ సుంకాల విధింపునకు బ్రేక్ పడింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట విదేశీ వస్తువులపై విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు తలొగ్గిన ప్రభుత్వం, మంగళవారం నుంచి వాటిని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ (సీబీపీ) శాఖ తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి 12.01 గంటల నుంచి ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ (ఐఈఈపీ) చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పుతో పాత పద్ధతిలో సుంకాలు నిలిచిపోయినప్పటికీ, ట్రంప్ తన మొండి వైఖరిని మాత్రం వీడలేదు. గతంలో ప్రకటించిన 10 శాతం గ్లోబల్ టారిఫ్‌ను ఏకంగా 15 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఐఈఈపీఏ చట్టం స్థానంలో 'వాణిజ్య చట్టం-1974'లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ వసూళ్లకు తెరతీశారు. అయితే, దీనిని కూడా చట్టసభల అనుమతి లేకుండా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేకపోవడం గమనార్హం. మరోవైపు స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్లపై జాతీయ భద్రత పేరిట గతంలో విధించిన సుంకాలు యథాతథంగా కొనసాగుతాయని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి.

### రీఫండ్స్ సెగ: ట్రంప్‌కు ఎదురుగాలి

సుంకాల విధింపు చెల్లదని కోర్టు తేల్చడంతో, ఇప్పటివరకు వసూలు చేసిన సుమారు 133 బిలియన్ల నుండి 175 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 15 లక్షల కోట్లు) నిధులను తిరిగి చెల్లించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఇల్లినాయ్ గవర్నర్ ఇప్పటికే 9 బిలియన్ డాలర్ల రీఫండ్ కోసం ట్రంప్‌కు బిల్లులు పంపగా, కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి దిగ్గజ కార్పొరేట్ కంపెనీలు కోర్టు మెట్లు ఎక్కాయి. సుంకాల భారం విదేశీయులపై పడిందని ట్రంప్ వాదిస్తున్నప్పటికీ, దాదాపు 96 శాతం భారం అమెరికన్ కస్టమర్లే భరించాల్సి వచ్చిందని న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్ వంటి సంస్థల అంచనాలు చెబుతున్నాయి.

### కొనసాగనున్న న్యాయపోరాటం:

రీఫండ్స్ ప్రక్రియ అంత సులభం కాదని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ పేర్కొన్నారు. వేల సంఖ్యలో ఉన్న దిగుమతిదారుల అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకు పెను సవాలుగా మారనుంది. ఈ న్యాయపరమైన చిక్కులు కొలిక్కి రావడానికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పట్టవచ్చని స్వయంగా అధ్యక్షుడు ట్రంపే అంగీకరించారు. మొత్తానికి సుప్రీంకోర్టు తీర్పుతో ట్రంప్ తన సుంకాల విధానంలో మార్పులు చేయాల్సి వచ్చినా, కొత్త చట్టాల ద్వారా తన 'రక్షణాత్మక వాణిజ్య' యుద్ధాన్ని కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.

# మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

- అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:** దేశీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో వెండి ధర ఏకంగా కిలోకు రూ. 15,000 పైగా పెరగగా, బంగారం ధర 10 గ్రాములకు రూ. 3,000 పైగా ఎగబాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు మరియు వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. ఆర్బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న అంతర్జాతీయ పరిణామాలను వివరించారు.. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.. గతంలో కేవలం భారత్, చైనా డిమాండ్ వల్లే ధరలు పెరిగేవి. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే ప్రస్తుత పెరుగుదలకు ప్రధాన కారణం అని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాల హెచ్చరికల వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.. భారత్ తన బంగారం అవసరాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతోంది.. దేశీయంగా తగినంత వెలికితీత వనరులు లేకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని వెల్లడించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. తాజా ధరల వివారల్లోకి వెళ్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 3,724 పెరిగి.. రూ. 1,60,600కి చేరింఇ.. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ. 15,931 పెరిగి రూ. 2,68,875కు ఎగబాకింది.. అయితే, బంగారం, వెండి ధరల పెరుగుదలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆర్బీఐ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. కొనుగోళ్లు ఇంకా పరిమితి దాటలేదు' అని పేర్కొన్నారు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్..



# కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం

**శ్రీనగర్, ఫిబ్రవరి 23:** జమ్మూకశ్మీర్‌లోని కిస్ట్వార్ జిల్లాలో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి. భద్రతాబలగాలు లొంగిపోవాలని హెచ్చరించగా.. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

# బంగ్లాదేశ్‌లో మరో దారుణం

### హిందూ దివ్యాంగురాలిపై సామూహిక లైంగికదాడి



**ఢాకా, ఫిబ్రవరి 23:** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, అకృత్యాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. చాంద్‌పుర్ జిల్లాలో హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలైన మహిళను బలవంతంగా ఎత్తుకెళ్లి దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతంలో స్పృహ కోల్పోయి ఉన్న మహిళను గుర్తించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా నివాసం ఉండే రకీబ్, సోహైల్, రస్సెల్ అనే ముగ్గురు వ్యక్తులు తనపై లైంగికదాడి కి పాల్పడినట్లు బాధితురాలు పేర్కొంది. వారు తనను తీవ్రంగా హింసించి గాయపరిచినట్లు తెలిపింది.ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాలు, మానవ హక్కుల కార్యకర్తలు నిరసనలకు దిగారు.

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

### ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత

## కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:** మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్,కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీం కోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. సోమవారం సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసింది. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. దీంతో కమిషన్ ఏర్పాటును సుప్రీం సమర్థించింది.

# రాజమహేంద్రవరం మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు సాయం

-మొదటిపేజీ తరువాయి

కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్య శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు. అనారోగ్యం బారిన పడిన, మరణించిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం బాధితులకు అందుతున్న వైద్యసాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు వివరించారు. చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించాలని సీఎం సూచించారు. "కిమ్స్ ఆస్పత్రి సమాచారం ప్రకారం వాంతులు, కడుపునొప్పితో వచ్చారు. మూత్రం నిలిచిపోవడం, డయాలసిస్ సమస్యలతో ఆస్పత్రులకు వచ్చారు. వీరంతా లాలాచెరువు ప్రాంతంలోని చౌడేశ్వరీనగర్, స్వరూప్‌నగర్ వాసులు. క్లినికల్ పరీక్షల్లో రక్తంలో యూరియా, సీరం, క్రియాటిన్ స్థాయిలు పెరిగినట్లు గమనించారు. వెంటనే నమూనాలు తీసుకొని ల్యాబ్‌లకు పంపారు. కోరుకొండ మండలం నరసాపురం గ్రామంలోని వరలక్ష్మి మిల్క్ డెయిరీ నుంచి 106 మందికి పాల సరఫరా అయింది. వరలక్ష్మి మిల్క్ డెయిరీ నుంచి వచ్చిన పాలే ఈ అస్వస్థతకు కారణమని నిర్ధరించారు". – సీఎం చంద్రబాబు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో విక్రయదారులు 106 ఇళ్లకు పాలు పంపిణీ చేస్తున్నారని అధికారులు వివరించారు. పాలు వినియోగించిన కుటుంబాల్లోని 75 మంది నుంచి శాంపిల్స్ సేకరించామని అధికారులు తెలిపారు. మిగిలిన అందరి నుంచి శాంపిల్స్ తీసుకుంటున్నామన్నారు. పాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపామని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలతో పాటు ర్యాపిడ్ టెస్ట్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని అధికారులు వివరించారు. ఫలితాల అనంతరం విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు రాజమహేంద్రవరం వెళ్లాలని ఆదేశించారు.

**ఇంటింటి సర్వే కొనసాగుతోంది:**

రాజమహేంద్రవరంలో అనూరియా (మూత్రం ఆగిపోవడం) మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో కొంతమంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. ఆరోగ్యశాఖ, నగరపాలక అధికారులు ఇంటిటా సర్వే చేపట్టినట్లు క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. కల్తీ పాలన ఆరోపణల నేపథ్యంలో పాలు పోసే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. 42 మంది రైతుల నుంచి పాల సేకరణ జరుగుతోందని, పశువులు, వాటి ఆహారం శాంపిల్స్ సేకరించినట్లు కీర్తి చేకూరి చెప్పారు. పాల వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పాలు, పెరుగు శాంపిళ్లను ఫుడ్ సేఫ్టీ విభాగం సేకరించిందని అన్నారు. స్థానికుల్లో ఏ లక్షణాలున్నా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ భరోసానిచ్చారు. ఏ లక్షణాలున్నా 94940 60060 ద్వారా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చునని కలెక్టర్ తెలిపారు.

"ఇప్పటివరకు 73 శాంపిల్స్ సేకరించాం. ఇవాళ సాయంత్రానికి ఫలితాలు వస్తాయి. ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఎలాంటి లక్షణాలున్నా చికిత్స అందిస్తున్నాం. 42 మంది రైతుల నుంచి పాల సేకరణ జరుగుతోంది. పశువులు, వాటి ఆహారం శాంపిల్స్ సేకరించాం. పాలు, పెరుగు శాంపిళ్లను ఫుడ్ సేఫ్టీ విభాగం సేకరించింది. ఇప్పటివరకు నలుగురు మరణించారు. తాడి కృష్ణవేణి, తాడి రమణి, రాధాకృష్ణమూర్తి, శేషగిరిరావు మ-రణించారు. 8 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇంటింటికి వెళ్లి రక్త నమూనాల సేకరణ కొనసాగుతోంది." – కీర్తి చేకూరి, జిల్లా కలెక్టర్

నాలుగుకు చేరిన అనూరియా మృతులు: ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ ఇద్దరు మృతి చెందారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో ఆస్పత్రుల్లో పలువురికి చికిత్స చేస్తున్నారు. కలుషిత పాలు తాగి అస్వస్థతకు గురై బాధితులు ఆస్పత్రిలో చేరారు. రాజమహేంద్రవరం ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఘటన జరిగిన ప్రాంతాల్లో పాలు, నీరు, ఇతర నమూనాల సేకరణించారు. క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు అధికారులు ఏర్పాటు చేశారు. ఘటనపై ఆరోగ్యశాఖ, నగరపాలక అధికారులు ఇంటింటా సర్వే చేపట్టారు. శాంపిళ్ల సేకరణ జరుగుతోంది: ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించి సమీక్షలు చేస్తున్నామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహా కిషోర్ తెలిపారు. పాలు సరఫరా చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. అనధికారికంగా నడుపుతున్న డెయిరీని సీజ్ చేశామని పేర్కొన్నారు. విజయవాడ నుంచి కూడా నిపుణులు వచ్చారని తెలిపారు. శాంపిళ్ల సేకరణ జరుగుతోంది. వాటి ఫలితాలు వచ్చాక మరిన్ని వివరాలు వస్తాయన్నారు.

# అనంతబాబు అడ్డంగా ఇరుక్కున్నట్టేనా





**రాజమండ్రి :** ఏపీ పాలిటిక్స్‌లో సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ట్విస్టులే ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. నాలుగేళ్లుగా ఎన్నో మలుపులు తిరుగుతూ వస్తున్న మర్డర్ కేసుపై..లేటెస్ట్‌గా సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. అప్పట్లో ఈ కేసు విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దర్యాప్తు సంస్థలు, నిందితుడు ఒక్కటైనట్లుగా బిహేవ్ చేశారని మండిపడింది. దర్యాప్తులో పోలీసుల తీరును తప్పుబట్టిందినిందితుడితో పోలీసులు ఇప్పటికీ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నట్లు కనిపిస్తోందని..ఇంత దారుణంగా వ్యవస్థలు నిర్వీర్యం అవుతుంటే డీజీపీ, ఎస్పీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది కోర్టు. అనంతబాబుకు బెయిల్ వచ్చేలా ఉద్దేశపూర్వకంగానే ఛార్జిషీట్ దాఖలు వేయడంలో ఆలస్యం చేశారని, నిందితుడితో పోలీసులు కుమ్మక్కైనట్లు స్పష్టం అవుతుందని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నవంబర్ 18లోపు ట్రయల్ కోర్టు విచారణను పూర్తి చేసి, కేసు విచారణ కోసం మార్చి 31 లోగా హైకోర్టు ఒక సీనియర్ జ్యుడిషియల్ ఆఫీసర్‌ను ప్రత్యేకంగా నియమించాలని కూడా ఆదేశించింది కోర్టు. 2022 మే 19న ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య జరిగింది. ఈ కేసులో ఆరోపణలు ఫేస్ చేస్తున్న అనంతబాబు బెయిల్ మీదున్నారు. ఇప్పుడాయన అజ్ఞాతంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. హత్యలో అనంతబాబు భార్య ప్రమేయం ఉందని ఆరోపించిన సిట్..చార్జిషీట్‌లో ఆమెను ఏ-2గా పేర్కొంది. ప్రస్తుతం అనంతబాబు సతీమణి లక్ష్మీదుర్గ కూడా పరారీలో ఉన్నట్లు చెబుతున్నారు. అయితే నిందితుడు 2022 నుంచి మధ్యంతర బెయిల్ మీదున్నా..ఇప్పటికీ దర్యాప్తు పూర్తి కాకపోవడం ఏంటంటూ సుప్రీంకోర్టు మండిపడింది. ఇది పోలీసుల నిర్లక్ష్యం కాకపోతే మరేమిటని కూడా ప్రశ్నించింది. సాక్షులను బెదిరించడానికి ప్రయత్నించినా, ఆధారాలను మాయం చేయాలని చూసినా బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరించింది కోర్టు. అయితే లేటెస్ట్‌గా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలతో నాడు ఈ కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన పోలీసుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఈ ఘటన జరిగినప్పుడు కాకినాడ జిల్లా ఎస్పీగా ఉన్న రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు..అప్పటి అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీలు భీమారావు, మురళీ, సీఐ మురళీకృష్ణారెడ్డిపై వేటు తప్పదని పోలీస్ శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కీలక పోలీస్ ఆఫీసర్లు.. డ్రైవర్ సుబ్రహ్మణ్యం మర్డర్‌ను.. అనుమానాస్పద హత్యగా నమోదు చేయడానికి ప్రయత్నించారన్న ఆరోపణలు ఉన్నాయి. బాధితులు, దళిత సంఘాల ఆందోళనలతో కేసును హత్య కేసుగా మార్చారు. కానీ, అనంతబాబును అరెస్ట్ చేయడానికి కనీసం ప్రయత్నం చేయలేదని అప్పట్లో పెద్ద దుమారం నడిచింది. పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో తప్పని పరిస్థితుల్లో అనంతబాబును అరెస్ట్ చేశారన్న విమర్శలు వచ్చాయి. అనంతబాబు అరెస్టు సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు కాంట్రవర్సీ అయింది. నిందితుడిగా ఆరోపిస్తున్న వ్యక్తిని జిల్లా ఎస్పీ అనంతబాబు గారు అని సంబోధించడం హాట్ టాపిక్ అయింది. హత్య జరిగిన ఘటనా స్థలిలో సీసీ ఫుటేజీలను..నిందితుల కాల్ రికార్డులు సేకరించలేదని..గూగుల్ టేకవుట్ కోసం సకాలంలో ప్రయత్నించాల్సి ఉన్నా, కావాలని లేట్ చేశారని ఎన్నో అలిగేషన్స్ ఉన్నాయి. హత్య తర్వాత అనంతబాబు నుంచి పోలీసులు సీజ్ చేసిన ఫోన్‌ను ఇప్పటికీ ఓపెన్ చేయలేదని అంటున్నారు. పైగా అనంతబాబుకు నేర చరిత్ర లేదంటూ చార్జిషీటులో మెన్షన్ చేసి..బెయిల్ రావడానికి మార్గం సుగమం చేశారన్న విమర్శలు వచ్చాయి. ఫైనల్‌గా ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాలతో కేసు దర్యాప్తు మరింత స్పీడప్ అయ్యే అవకాశం ఉంది. కోర్టు అనంతబాబు బెయిల్‌ను కంటిన్యూ చేయడంతో..ఏ-2గా ఉన్న ఆయన భార్య లక్ష్మీదుర్గను అరెస్ట్ చేసేందుకు పోలీసులు రెడీ అవుతున్నట్లు టాక్ నడుస్తోంది. ఇక అప్పటి పోలీస్ అధికారులపై వేటు వేస్తారన్న ప్రచారం కూడా ఊపందుకుంది. అనంతబాబు డ్రైవర్ హత్య కేసు ఇంకా ఎన్ని మలుపులు తీసుకుంటుందో.? ఏం జరగబోతుందో వేచి చూడాలి మరి.

# జెన్ జీ టీమ్ తయారు చేస్తున్న జనసేన



**కాకినాడ :** ఒక్క సీటుతో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి.. చట్టసభల్లోకి అడుగు పెట్టింది జనసేన. ఏకంగా 21 సీట్లతో కింగ్ మేకర్‌గా కూటమిలో కొనసాగుతోంది. అయితే ఈ ఏడాదిన్నర కాలంగా ప్రభుత్వం, పాలనపైనే ఫోకస్ పెట్టిన జనసేనాని..ఇప్పుడు పార్టీ పటిష్టత కోసం సీరియస్ కాన్సన్‌ట్రేషన్ చేశారు. గ్రౌండ్ లెవల్‌లో క్యాడర్ బలోపేతం కోసం ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికంటే మరింత బలపడి టీడీపీ, వైసీపీతో సమానంగా స్ట్రాంగ్ ఫోర్స్‌గా నిలబడాలన్నది పవన్ వ్యూహంగా కనిపిస్తోంది. ఇంతకాలం పార్టీ బలోపేతంపై పెద్దగా ఫోకస్ చేయని పవన్..ఫ్యూచర్ పాలిటిక్స్‌ను దృష్టిలో పెట్టుకుని గ్రాస్ రూట్ లెవెల్ నుంచి రాష్ట్ర స్థాయి దాకా జనసేనను పటిష్టం చేయాలని డిసైడ్ అయ్యారట. పవర్‌లో ఉన్నాం కాబట్టి.. పార్టీని స్ట్రెంథెన్ చేసేందుకు ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట. పవన్ కోసం పనిచేస్తున్న లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. పార్టీకి అంతో ఇంతో క్యాడర్ ఉంది. కానీ సంస్థాగతంగా జనసేనకు బలమైన పునాదులు లేవు. గ్రామ, మండల, జిల్లా కమిటీలు స్ట్రాంగ్‌గా లేని పరిస్థితి. పైగా పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై.. వైసీపీ, టీడీపీ వెంట నడుస్తున్నట్లుగా జనసేనకు బ్యాక్ బోన్‌గా నిలుస్తున్న ఫిక్స్‌డ్ ఓటర్లు కూడా లేరు. ఇప్పటికే ఓటర్లుగా ఉన్న వారిలో మెజార్టీ ప్రజలు పార్టీల వారీగా విడిపోయిన పరిస్థితి. ఏ పార్టీకి సంబంధం లేని వారు పరిస్థితులను బట్టి..ఓసారి వైసీపీకి, మరోసారి టీడీపీకి మద్దతు తెలుపుతుంటారు. అయితే జనసేనకు కూడా వైసీపీ, టీడీపీ లాగా ఒక బలమైన వర్గాన్ని వెన్నుముకగా మార్చుకోవాలన్నది పవన్ ఆలోచన అంటున్నారు. జెన్ జీ సెంట్రిక్‌గా పాలిటిక్స్ చేస్తూ.. 20, 25 ఏళ్లలోపు వారిని జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులు అయ్యేలా చేయాలనేది పవన్ వ్యూహమంటున్నారు. రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే పవన్ స్ట్రాటజీ సిద్ధం చేస్తున్నారట. పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, జెన్ జీ ఆలోచనలను అర్థం చేసుకోవాలని లీడర్లకు నొక్కి చెప్తున్నారట పవన్. కూటమితో సమన్వయం, యువత ఆకాంక్షలు, ప్రజలతో సన్నిహిత సంబంధాలతో జనసేన మరోసారి ప్రభంజనం సృష్టించేలా పవన్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారట. ప్రత్యేకంగా జెన్ జీ తరం సరికొత్తగా ఆలోచిస్తోందని..వారిని పార్టీకి దగ్గర చేయాలనేది సేనాని ఆలోచనగా చెబుతున్నారు. జెన్ జీ అన్నది ఇప్పుడు వరల్డ్ వైడ్‌గా హాట్ టాపిక్‌గా ఉంది. పలు దేశాల్లో ప్రభుత్వాల తీరు నిరసిస్తూ తిరుగుబావుటా ఎగరవేస్తూ జెన్ జీ సత్తా చాటుతోంది. యువ కెరటాలై కన్నెర్ర చేస్తూ ప్రభుత్వాలకు వణకు పుట్టిస్తున్నారు. ఈ మధ్య దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు జెన్ జీ గురించే ఎక్కువగా మాట్లాడుతున్నాయి. దేశంలోని జెన్ జీ నిర్మాణాత్మకమైనదని ఇటీవలే ప్రధాని మోదీ కూడా కామెంట్స్ చేశారు. 1997 నుంచి 2012 మధ్య జన్మించిన జనరేషన్‌ను జెన్ జీగా పిలుస్తారు. సోషల్ మీడియా వేదికల ద్వారా రూపుదిద్దుకున్న మొదటి నిజమైన డిజిటల్ తరంగా చెబుతారు. అలాంటి జెన్ జీలను తమ వైపునకు తిప్పుకోవాలనేది జనసేన ప్రత్యేక కార్యాచరణగా ఉంది. ఏపీ రాజకీయాల్లో..అయితే టీడీపీ లేకపోతే వైసీపీ అన్నట్లుగా పరిస్థితి ఉంది. ఏపీలో థర్డ్ ఫోర్స్‌గా జనసేన దూసుకుని రావడానికి ఇదే సరైన సమయమని..అందుకు యువతను ఆయుధంగా మల్చుకోవాలనేది పవన్ ప్లాన్‌గా చెబుతున్నారు. టీడీపీకి ఎప్పటి నుంచో బలమైన క్యాడర్ గ్రౌండ్ లెవల్ వరకు ఉంది. విపక్షంలో ఉన్న వైసీపీకి కూడా చెప్పుకోదగ్గ బలమే ఉంది. అయితే ఫ్యాన్ పార్టీ క్యాడర్, లీడర్లలో ఉన్న స్తబ్దతను తమ పార్టీ ఎదుగుదలకు అనువుగా మార్చుకోవాలని జనసేన చూస్తోందట. 2029 ఎన్నికల నాటికి ఏపీలో మూడో అతి పెద్ద పొలిటికల్ ఫోర్స్‌గా నిలబడాలనే ప్లాన్‌తో జెన్ జీకి ఆకర్షించేలా పావులు కదుపుతున్నారట. అంతకంటే ముందే లోకల్ బాడీ ఎన్నికల్లో తన సత్తాను చాటితే..వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేలను గెలిపించుకోవడం ఈజీ అవుతుందని లెక్కలు వేసుకుంటున్నారట. స్థానిక సంస్థల్లో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో యువతకు అవకాశం ఇచ్చి రోల్ మోడల్‌గా నిలవాలన్నది జనసేన ప్లాన్ అంటున్నారు. 20, 25 ఏళ్లలోపు యువకులను తమ పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షిస్తే..తమకు సాలిడ్ ఓట్ బ్యాంకు ఉండటమే కాదు..పార్టీకి బలమైన పునాదులు పడుతాయని భావిస్తున్నారట. భవిష్యత్ అంతా యువతే కాబట్టి..పైగా జెన్ జీ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసేలా..జెన్ జీల సెంట్రిక్‌గా ఫ్యూచర్ ప్లాన్లు తయారు చేస్తున్నారట. ఓవైపు వైసీపీ వీక్ అయిన చోట తాము ఆల్టర్నేట్‌గా బలపడాలనే స్కెచ్‌తో పాటు..మిగతా పార్టీలతో సమానంగా తమకు డెడికేటెడ్ ఓటు బ్యాంకును తయారు చేసుకునే స్కెచ్ వేస్తున్నారట. జనసేన ప్రజల కోసం పనిచేస్తుందని..ఆ పార్టీలోకి వెళ్తేనే రాజకీయ అవకాశాలు దక్కుతాయని యువతకు నమ్మకం కలిగించేలా సరికొత్త మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తున్నారట. జెన్ జీస్‌ను అట్రాక్ట్ చేసేలా పవన్ వేస్తున్న వ్యూహాలు ఎంత వరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

## అసంఘటిత కార్మికులకు అండగా ఉంటాం

-మొదటిపేజీ తరువాయి

నమోదు చేసుకున్నారని చెప్పారు. వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల నమోదును వేగవంతం చేస్తున్నామన్నారు. కార్మికుల ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అసంఘటిత కార్మికులకు ఉచిత వైద్య సేవలతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని కార్మిక శాఖ మంత్రి సుభాష్ స్పష్టం చేశారు. ప్రసూతి సహాయం కోసం రూ.20,000., వివాహ కానుక కింద రూ.40,000., సాధారణ మరణం సంభవిస్తే రూ.60,000., సహాయం చేయడంతో పాటు అంత్యక్రియల ఖర్చులకు తక్షణమే రూ.20,000., ఆర్థిక సహాయం చేస్తున్నామని మంత్రి వివరించారు. అదే విధంగా 1వ తరగతి నుంచి 12వ తరగతి చదివే నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్ పథకం కూడా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాలతో సంబంధం లేకుండా భవన నిర్మాణ కార్మికులు వివిధ పనుల్లో నిమగ్నమై ఉండటంతో పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. అసంఘటిత కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సుభాష్ అసెంబ్లీలో స్పష్టం చేశారు.

## ఏమాత్రం మారని వైఎస్సార్సీపీ సభ్యుల తీరు

-మొదటిపేజీ తరువాయి

చేశారు. పెద్దఎత్తున ఆందోళన చేస్తోన్న సభ్యులను పిలిచిన ఛైర్మన్ ఫుటేజీ ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

**ప్రత్యేక అంశాల ప్రస్తావనకు అవకాశం**

ఇదే సమయంలో వరుసగా 5 రోజుల పాటు సభా కార్యకలాపాలు నిలిచిపోవడం, సభలో వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళన చేస్తోన్న దృష్ట్యా సభా కార్యకలాపాల నిర్వహణ కోసం మండలి బీఏసీ సమావేశమైంది. ఛైర్మన్ కొయ్యె మోషను రాజు అధ్యక్షతన సమావేశంలో సభలో ప్రజా సమస్యలపై చర్చించడంపై చర్చించారు. ఈ నెల 26న మండలిలో తిరుమల కల్తీ లడ్డూపై చర్చించాలని నిర్ణయించారు. అదే విధంగా వ్యవసాయం, లా అండ్ ఆర్డర్ తదితర సమస్యలపై స్వల్పకాలిక చర్చ జరపాలని నిర్ణయించారు. అనంతరం 1.45 గంటలకు సభ ప్రారంభం కాగా సభ్యులు ప్రత్యేక అంశాల ప్రస్తావనకు ఛైర్మన్ అవకాశం కల్పించారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలతో చనిపోయిన ఘటనలపై హోం మంత్రి సభలో స్టేట్?మెంట్ ఇచ్చారు. ఘటనను ఖండించిన హోం మంత్రి కల్తీ పాల ఘటనపై ప్రభుత్వం దర్యాప్తు జరుపుతోందని బాధ్యులపై చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. హోం మంత్రి సమాధానం అనంతరం మండలి రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. ఆ ఆరోపణలు అవాస్తవం: ఈ సందర్భంగా మండలిలో ఎమ్మెల్సీ బొత్స మాట్లాడుతూ తిరుమల లడ్డూ కల్తీపై ఈ నెల 26న మండలిలో చర్చించాలని నిర్ణయించారని అలానే 24న లా అండ్ ఆర్డర్, 25న వ్యవసాయంపై చర్చిస్తారని తెలిపారు. సాగునీటిపారుదల, విద్య, పెట్టుబడులపైనా చర్చకు ప్రభుత్వం అంగీకరించిందని బొత్స తెలిపారు. ఇటీవల వైఎస్సార్సీపీ సభ్యులు చెప్పులు వేసుకుని వేంకటేశ్వర స్వామి ఫొటోలు పట్టుకున్నారనే ఆరోపణలు అవాస్తవమని చెప్పారు. ఒరిజినల్ వీడియో ఫుటేజీ ఇచ్చేందుకు ఛైర్మన్ సమ్మతించారని వెల్లడించారు.

## టీటీడీ నిబంధనలు మరింత కఠినతరం

-మొదటిపేజీ తరువాయి

కల్యాణ్ ఈ రోజు సభకు రాలేదు. రేపు సభకు వచ్చిన తరువాత కల్తీ నెయ్యిపై పవన్ కల్యాణ్ కూడా ఈ చర్చలో పాల్గొనే అవకాశం ఉంది. మధ్యాహ్నం 12.30 గంటలకు కల్తీ నెయ్యిపై సీఎం చంద్రబాబు ఓ ప్రకటన చేయనున్నారు. టీటీడీ నిబంధనలు ప్రకారం అన్యమతస్థులు శ్రీవారి దర్శనం చేసుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

**స్వర్ణ దేవాలయం తరహాలో**

తిరుమలలోనూ స్వర్ణ దేవాలయం తరహాలో చట్టాన్నీ తీసుకొచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అమృతసర్‌లో స్వర్ణ దేవాలయానికి ఉన్న ప్రత్యేక చట్టం ద్వారా తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అధికారం ఉంది. అటువంటి చట్టాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంకు కూడా తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు తీసుకునే వెసులుబాటు కల్పించే దిశగా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. స్వర్ణ దేవాలయం చట్టాన్ని వెంటనే అధ్యయనం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

**రేపు అసెంబ్లీలో పెడతాం**

తిరుమల లడ్డూ కల్తీకి సంబంధించి వాస్తవాలన్నీ రేపు అసెంబ్లీలో పెడతామని అసెంబ్లీ లాబీలో మీడియాతో నిర్వహించిన చిట్ చాట్?లో మంత్రి నారా లోకేశ్ చెప్పారు. దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగానే బయటపెడతామని అన్నారు. అసెంబ్లీకి రమ్మని ఎవ్వరూ బొట్టుపెట్టి పిలవరని ఎద్దేవాచేశారు. సభకు రావటం సభ్యులుగా వారి బాధ్యత అని గుర్తుచేశారు. దేవుడిని కూడా వైఎస్సార్సీపీ రోడ్డు మీదకు తీసుకురావవటం బాధాకరమైన విషయమని మండిపడ్డారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు ఆక్షేపణీయమని మంత్రి లోకేశ్ అన్నారు.

**అదే తీరు**

మరోవైపు శాసనమండలిలో వైఎస్సార్సీపీ తీరు మారలేద. హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ ద్వారా టీటీడీకి నెయ్యి సరఫరా చేయడంపై శాసన మండలిలో చర్చించాలని మండలిలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు వరుసగా ఐదో రోజు ఆందోళనకు దిగారు. ఇవాళ సభలో చర్చించాలని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు వరుసగా ఐదోరోజు వాయిదా తీర్మానం ఇవ్వగా దాన్ని మండలి ఛైర్మన్ తిరస్కరించారు. ప్లకార్డులు పట్టుకుని పోడియంను చుట్టుముట్టి వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఆందోళనల మధ్యే ప్రశ్నోత్తరాలను మండలి ఛైర్మన్ చేపట్టారు. వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళన ఉధృతం చేయడం, సభలో గందరగోళం నెలకొనడంతో సభను కాసేపు వాయిదా వేశారు. వరుసగా ఐదు రోజుల పాటు సభా కార్యకలాపాలు నిలిచిపోవడం, సభలో వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళన చేస్తున్న దృష్ట్యా సభా కార్యకలాపాల నిర్వహణ కోసం మండలి బీఏసీ సమావేశమైంది. ఛైర్మన్ కొయ్యె మోషను రాజు అధ్యక్షతన సమావేశంలో సభలో ప్రజా సమస్యలపై చర్చించే విషయమై కూటమి, వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు చర్చించారు.

## వైసీపీకి తలనొప్పిగా స్లోగన్

**విజయవాడ :** సిగరెట్ తాగడం ఆరోగ్యానికి హానికరం? ఇది సిగరెట్ ప్యాకెట్ పైనే ఉంటుంది. చాలామందిని ఆలోచింపజేస్తుంది కూడా. అయితే సిగరెట్ కు ఎడిక్ట్ అయినవారు మానుకోలేరు కానీ.. ఈ స్లోగన్ చదివిన వారు మాత్రం కాస్త దూరంగానే ఉంటారు. అయితే రాజకీయంగాను ఇప్పుడు అదే స్లోగన్ వినిపిస్తోంది. సాధారణంగా పొలిటికల్ స్లొగన్స్ బలంగా వెళ్తాయి ప్రజల్లోకి. అప్పట్లో జగన్మోహన్ రెడ్డి విషయంలో.. రావాలి జగన్.. కావాలి జగన్ అనే స్లోగన్ బలంగా వెళ్ళింది ప్రజల్లోకి. 2019లో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు దోహద పడింది. సైకో పోవాలి.. సైకిల్ రావాలి అనే నినాదం తో ముందుకు వెళ్ళింది తెలుగుదేశం పార్టీ 2024 ఎన్నికల్లో. ఘనవిజయం సొంతం చేసుకుంది. పొలిటికల్ స్లొగన్స్ తో పాటు రాజకీయ పార్టీల పాటలు ఇప్పుడు చాలా ప్రభావితం చేస్తున్నాయన్నమాట. మరోవైపు తాజాగా ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఒక పొలిటికల్ స్లోగన్ ను బయటకు తీశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో ఆరోగ్యానికి హానికరం అనే ట్యాగ్ ను జత చేశారు. ఈ రాష్ట్రానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హానికరం అన్న మాట అనేసారు. అది ఇప్పుడు టిడిపి కూటమి శ్రేణుల్లోకి బలంగా వెళ్ళింది. తటస్థులతో పాటు వైసిపి వ్యతిరేకులకు ఎంతగానో ఆకర్షిస్తోంది ఈ నినాదం. వైసిపి హయాంలో.. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి సైకో అని వ్యాఖ్యానించారు. వైసీపీ నుంచి అనుకున్న స్థాయిలో దీనిపై రియాక్షన్ రాలేదు. క్రమేపి ఈ సైకో అనే పదం కూటమి పార్టీల వాడుక అస్త్రంగా మారిపోయింది. సామాన్యులు సైతం సైకో నినాదంతో వైసిపి చర్యలను తప్పుపట్టేవారుజగన్ పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల పాటు వెనక్కి వెళ్ళిపోయింది అనే మాట కూడా ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. సంక్షేమం పేరుతో అభివృద్ధిని మరుగున పడేసారన్న విమర్శ ఉంది. అప్పట్లో బీజేపీ నేత పురందేశ్వరి జగన్ చేసిన అప్పులను ప్రస్తావించారు. పెద్ద ఎత్తున విమర్శలు చేయడంతో.. అప్పుల ప్రభుత్వం అన్న నినాదం ప్రజల్లోకి బలంగా వెళ్ళిపోయింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎక్కువగా డ్యామేజ్ చేసేది ఈ స్లొగన్స్. తాజాగా పయ్యావుల కేశవ్ చేసిన.. రాష్ట్రానికి వైసీపీ హానికరం అనే నినాదం కూడా.. ఓ రేంజ్ లో ప్రభావం చూపడం ఖాయం అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## ప్రభాకర్ గుప్తా పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



**తాండూరు మున్సిపల్, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణ సీనియర్ నాయకుడు తాటికొండ పరిమల్ గుప్తా తండ్రి మాజీ మున్సిపల్ చైర్మన్ తాటికొండ స్వప్న పరిమల్ గుప్తా మామ ప్రభాకర్ గుప్తా స్వర్గస్తులైన విషయం తెలిసి సోమవారం పట్టణం లోని వారి నివాసానికి వెళ్లి ప్రభాకర్ గుప్తా పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తాటికొండ కుటుంబం తో ఉన్న సన్నిహిత్యాన్ని గుర్తు చేస్తూ వారి కుటుంబానికి ఓదార్చి ప్రభాకర్ గుప్తా ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించిన పట్నం మహేందర్ రెడ్డి వారితో పాటు బీదర్ రాజశేఖర్,పట్లోళ్ల నర్సిములు, మురళికృష్ణ గౌడ్, కౌన్సిలర్ మన్నపురం రామకృష్ణ, జుబైర్ లాల,బిర్కెట్ రఘు, భగవాన్ మాజీ కౌన్సిలర్స్ వెంకన్న గౌడ్, బోయ రవిరాజు, వెంకట్రాములు నాయక్,కోట్ల రాజ్ కుమార్, దవులయ్య మరియు తదితరులు పాల్గొన్నారు...



డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల జారీ విషయంలో న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హైదరాబాద్ లోని సమాచార శాఖ భవన్ ముందు ఎౌజేట చేపట్టిన ధర్నా లో పాల్గొని వారికి సంఘీభావం తెలిపిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, రాష్ట్ర కోశాధికారి యోగానంద్,హైదరాబాద్ ఇంచార్జ్ నవీన్ కుమార్ యారా లు

## గోల్డ్ మెడల్ సాధించిన అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్ ను అభినందించిన:

- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, ఫిబ్రవరి 23(సమయం న్యూస్) :** 4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో నారాయణపేట జిల్లా అదనపు ఎస్పీ డీఏఆర్ (DAR) ఎండి రియాజ్ హూల్ హక్ జోగు లాంబ జోన్-7 నుండి లాన్ టెన్నిస్ లో విశిష్ట ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించారు. 50 ఏళ్ల పైబడిన సీనియర్ అధికారుల లాన్ టెన్నిస్ విభాగంలో పాల్గొన్న అదనపు ఎస్పీ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శిస్తూ ప్రత్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఎస్పీ ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీకి గోల్డ్ మెడల్ అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జోగులాంబ జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ నారాయణపేట జిల్లాకు స్వర్ణ పతకాన్ని తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడా రంగంలో పోలీస్ అధికారులు రాణించడం జిల్లా పోలీస్ విభాగానికి గర్వకారణమని, విధుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా ప్రతిభ చాటడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ తరఫున అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హక్ ను జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కుక్క నాకడంతో ఇన్ఫెక్షన్..

- కాళ్లు, చేతులు కోల్పోయిన మహిళ !
- బ్రిటన్‌లో కుక్క నాలుక తగలడంతో మహిళకు తీవ్ర అస్వస్థత
- శరీరంలోని చిన్న గాయం ద్వారా రక్తంలోకి చేరిన ప్రమాదకర బ్యాక్టీరియా
- సెప్సిస్ కారణంగా రెండు చేతులు, రెండు కాళ్లు తొలగించిన వైద్యులు
- కుక్కల లాలాజలంలోని 'క్యాప్‌నోసైటోఫాగా' బ్యాక్టీరియాతోనే ముప్పు
- సుమారు 32 వారాల పాటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరిన మహిళ

**హైదరాబాద్ :** బ్రిటన్‌లో నివసిస్తున్న భారత సంతతి మహిళ జీవితంలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న కుక్క.. మహిళ గాయాన్ని నాకడంతో ఆమె సెప్సిస్ బారిన పడి, రెండు చేతులు, రెండు కాళ్లు కోల్పోవాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన పెంపుడు జంతువుల యజమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

వివరాల్లోకి వెళితే, యూకేలోని వుల్వర్‌హాంప్టన్‌కు చెందిన మంజిత్ సంఘా (52) అనే మహిళ గత ఏడాది జూలైలో అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చిన ఆమెకు అనారోగ్యంగా అనిపించగా, మరుసటి రోజు ఉదయానికి స్పృహ కోల్పోయారు. ఆమె చేతులు, కాళ్లు చల్లగా మారడం, పెదవులు నీలంగా మారడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఆమె భర్త కమల్‌జిత్ సంఘా బీబీసీకి వివరిస్తూ, "ఒక్క రోజులో అంతా మారిపోయింది. శనివారం కుక్కతో ఆడుకుంది, ఆదివారం పనికి వెళ్లింది, సోమవారానికి కోమాలోకి వెళ్లిపోయింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. న్యూ క్రాస్ ఆసుపత్రిలోని ఐసీయూలో చేర్చిన వైద్యులు, ఆమె సెప్సిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. కుక్కల లాలాజలంలో సహజంగా ఉండే 'క్యాప్‌నోసైటోఫాగా కానిమోర్సస్' అనే బ్యాక్టీరియా, ఆమె శరీరంలోని చిన్న గాయం ద్వారా రక్తంలోకి ప్రవేశించిందని గుర్తించారు. ఈ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఆమెకు ఆరుసార్లు గుండెపోటు వచ్చింది. ప్రాణాలు కాపాడే క్రమంలో వైద్యులు ఆమె రెండు కాళ్లు (మోకాళ్ల కింద), రెండు చేతులు తొలగించారు. ఆమె ప్లీహాన్ని కూడా తీసేయాల్సి వచ్చింది. సుమారు 32 వారాల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన మంజిత్, ఇటీవల ఇంటికి తిరిగి వచ్చారు. పెంపుడు జంతువులతో ఆడుకునేటప్పుడు, వాటి లాలాజలం గాయాలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

## ఐఐఐటి జంక్షన్ వద్ద మల్టీ లెవల్ ఫ్లైఓవర్ / గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణం

-- ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



హైదరాబాద్ నగరంలోని సిరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఐఐఐటి జంక్షన్ వద్ద భారీ ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు మల్టీ లెవల్ ఫ్లైఓవర్ మరియు గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టు చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో అమలు కానుంది.

ఈ పనులకు రూ. 459.00 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరైంది. ప్రాజెక్టు పూర్తి గడువు 24 నెలలలో పూర్తి చేయాలని నిర్ణయించారు

**ప్రాజెక్టు ముఖ్య అంశాలు:**

లెవల్-1 ఫ్లైఓవర్ (ISB రోడ్ డి DLF వైపు):
4 లేన్ల ద్విముఖ ఫ్లైఓవర్
పొడవు: 635 మీటర్లు
పియర్స్: 17, స్పాన్లు: 16

అండర్‌పాస్ (గచ్చిబౌలి నుండి దీఎజూూ జంక్షన్ వైపు):
6 లేన్ల ద్విముఖ మార్గం
పొడవు: 500 మీటర్లు
వెడల్పు: 30.53 మీటర్లు

లెవల్-2 డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ (ISB రోడ్ నుండి గచ్చిబౌలి వైపు):
3 లేన్ల ఏకదిశ మార్గం
పొడవు: 1.2 కి.మీ
వెడల్పు: 12 మీటర్లు
పియర్స్: 22, స్పాన్లు: 21

లెవల్-2 డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ (DLF రోడ్ నుండి దీఎజూూ వైపు):
3 లేన్ల ఏకదిశ మార్గం
పొడవు: 945 మీటర్లు
వెడల్పు: 12 మీటర్లు
పియర్స్: 17, స్పాన్లు: 16

**ప్రాజెక్టు ప్రయోజనాలు:**

ఐఐఐటి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యలకు పెద్ద ఉపశమనం

డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ వల్ల భూసేకరణ ఖర్చులు తగ్గింపు తద్వారా

సుమారు 93.38% ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం

యూ-టర్న్‌ల అవసరం లేకుండా సౌకర్యవంతమైన ప్రయాణం

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, లింగంపల్లి ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ

ూ== కు వేగవంతమైన చేరిక

పాత ముంబై హైవేపై ట్రాఫిక్ తగ్గింపు

ప్రస్తుతం ఐఐఐటి జంక్షన్ వద్ద పీక్ అవర్ ట్రాఫిక్ 14,942 PCU/గంటగా నమోదవుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత జంక్షన్‌లోని నాలుగు దిశల్లో కలిపి ప్రయాణ సమయం సుమారు 36 నిమిషాలు తగ్గుతుందని అంచనా.

ఈ ప్రాజెక్టు అమలుతో హైదరాబాద్ నగర ట్రాఫిక్ నిర్వహణలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి.

గత ప్రభుత్వంలో స్ట్రాటజిక్ రోడ్డు డెవలప్మెంట్ స్కీమ్ ద్వారా సిగ్నల్

## విద్యార్థిని విద్యార్థులకు జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహణ

- విద్యార్థులందరు భావి శాస్త్ర వేత్తలుగా ఎదగాలి.
- జిల్లా అడిషనల్ కలెక్టర్ పిలుపు. ..



**కరీంనగర్ ఫిబ్రవరి23( సమయం న్యూస్) :** ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసే సదుద్దేశంతో, సైంటిఫిక్ టెంపర్ పెంచే సదుద్దేశ్యం తో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు అమిరిశెట్టి దామోదర్, ప్రధాన కార్యదర్శి ఎ.రాంకిరణ్ మరియుకార్యవర్గం ఆధ్వర్యంలో 16 మండలాల లోని అన్ని ప్రభుత్వ పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న మండల టాపర్స్ అయిన విద్యార్థిని విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ డిస్ట్రిక్ట్ సైన్స్ మ్యూజియం నందు నిర్వహించడం జరిగింది .ముఖ్య అతిథులుగా విచ్చేసిన కరీంనగర్ డిస్ట్రిక్ట్ అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్ ) ,జిల్లా విద్యా శాఖ అధికారి అశ్విని తానాజీ వాకడె మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులందరు మంచి క్రమశిక్షణ తో, మంచి అలవాట్లతో తరగతి గది లో చదువుకొన్న అంశాలను నిజ జీవితం తో అనుసంధానం చేసుకోవాలని శాస్త్రీయ దృక్పతాన్ని పెంపొందించుకోవాలని, శాస్త్రవేత్త ల కృషిని స్ఫూర్తిగా తీస్కొని ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ నందు మంచి పట్టు సాధించి భావి శాస్త్ర వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల తో,ఉపాధ్యాయుల తో భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల కి సంభందించి అనేక అంశాలను అడిగి సంతృప్తి వ్యక్తం చేసారు. జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు అందరూ డిస్ట్రిక్ట్ సైన్స్ మ్యూజియం సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉన్నత పౌరులుగా ఎదగాలని ,సైన్స్ పట్ల ఆసక్తిని పెంపోందించుకోవాలని ఆకాంక్షిస్తూ ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ కు సంభందించిన టాలెంట్ టెస్ట్ పేపర్ సీల్డ్ కవర్ ను ఆవిష్కరించారు. 16 మండలాల నుండి ఎంపిక కాబడినమొదటి,రెండవస్థానాలలో నిలిచిన విద్యార్థులకు మెమెంటో ల ప్రధానం చేసారు. కరీంనగర్ నుండి ప్రథమ స్థానం కనపర్తి సుశాంత్ (గ్రామీ జంగపల్లి ),ద్వితీయ స్థానం భూంపల్లి కీర్తి (ZPHS JANGAPALLI),మూడవ స్థానం కోమటిరెడ్డి ఆదిత్య (౧+మీ ఎలగందల్ ) ల కి మెమెంటో ప్రధానం చేసారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి నందు జరిగే టాలెంట్ టెస్ట్ లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈకార్యక్రమం లో ప్లానింగ్ కోఆర్డినేటర్ మిలకూరి శ్రీనివాస్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని వసుంధర ఫోరమ్ అఫ్ ఫిజికల్ సైన్స్ భాధ్యులు నాగుల భుజన్ చందర్, నలుమాచు చంద్ర శేఖర్,కామిరెడ్డి రామేశ్వర్ రెడ్డి గైడ్ టీచర్స్ గోరంటల ఆనందం, ఎ.మునీరొద్దిన్, 32 పాఠశాల ల నుండి సంభంధిత గైడ్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యానగర్‌లో ట్రాఫిక్ భద్రతపై విద్యార్థులకు అవగాహన

- "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ -- 2వ దశ"లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం

**విద్యానగర్, ఫిబ్రవరి 23 :** "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ -- 2వ దశ" ప్రచారంలో భాగంగా విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నియమాలు మరియు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. బేగంపేట టిటిఐ ఇన్‌స్పెక్టర్ శ్రీ నాగుల అశోక్ మరియు ఉస్మానియా యూనివర్సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఈస్ట్ జోన్ ఏసీపీ శ్రీ ఎ. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించుకుంటే రోడ్డు భద్రతపై బాధ్యతాయుతమైన దృక్పథం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. రోడ్డు పై మన భద్రతతో పాటు ఇతరుల భద్రత కోసం కూడా ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రతి రైడర్, పిలియన్ రైడర్ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ వినియోగించాలి, జీబ్రా క్రాసింగ్ వద్ద నియమాలు పాటించాలి, ఓవర్‌టేకింగ్ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వివరిం చారు. బేగంపేట టిటిఐ ఇన్‌స్పెక్టర్ శ్రీ నాగుల అశోక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలను పాటించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, రెడ్ సిగ్నల్ జంపింగ్, అతివేగం, ట్రిపుల్ రైడింగ్ వల్ల జరిగే ప్రమాదాలను ఆయన వివరించారు. రోడ్డు దాటేటప్పుడు జీబ్రా లైన్స్ వినియోగించడం, ఎల్లప్పుడూ ఫుట్‌పాత్‌పై నడవడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేశారు. తల్లిదండ్రులు, పెద్దలను గౌరవిస్తూ క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై క్విజ్ నిర్వహించి విజేతలకు హీరో మోటర్ తరఫున హెల్మెట్లు బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీ ప్రభు సారు, వైస్ ప్రిన్సిపల్ లావణ్య మేడం, సిబ్బంది, సుమారు 150 మంది ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. హీరో మోటర్ మేనేజర్ శ్రీ సాదిక్, టిటిఐ బేగంపేట సిబ్బంది సాయికుమార్, కృష్ణ కూడా హాజరయ్యారు.



## ప్రశాంతంగా ముగిసిన సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- పురుషుల జట్టు విజేత వనపర్తి, మహిళల జట్టు విజేత గద్వాల
- విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్, మున్సిపల్,(మం)ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** గ్రామీణ స్థాయి నుండి ప్రపంచ స్థాయి కి క్రీడాకారులు ఎదగడానికి సీఎం కప్ క్రీడలు దోహదపడుతుంది. సీఎం కప్ రెండవ ఎడిషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మక్తల్ పట్టణంలో ప్రశాంతంగా ముగిసాయి. గత శుక్రవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో 33 జిల్లాల నుండి 66 టీంలు సుమారు 1200 మంది క్రీడాకారులు,కోచ్ లు,వారి సహాయకులు పాల్గొన్నారు. నేటి ముగింపు కార్యక్రమంలో మంత్రి డా. వాకిటి శ్రీహరి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన జిల్లా క్రీడశాఖ అధికారి శెట్టి వెంకటేష్ ను,పిడి విష్ణు,పి ఈ టి రాఘవేందర్ లను అభినందించారు ,మక్తల్ పట్టణంలో త్వరలో 25 కోట్లతో స్టేడియం పనులు ప్రారంభమవుతాయని అది పూర్తి అయితే ఇక్కడ జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం పురుషుల,మహిళల జట్ల ఫైనల్ మ్యాచ్ లు హోరాహోరీగా జరిగాయి. మహిళల విభాగంలో గద్వాల జట్టు వర్సెస్ రంగారెడ్డి జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 36-31 పాయింట్ల తేడాతో గద్వాల విజేతగా నిలిచింది,మూడవ స్తానం కోసం కరీంనగర్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో 37-18 పోయింట్ల తేడాతో కరీంనగర్ మూడవ స్థానం కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో వనపర్తి జట్టు రంగారెడ్డి జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 39-16 పాయింట్ల తేడాతో వనపర్తి జట్టు విజయం సాధించి మొదటిస్థానంలో నిలిచింది. మూడవ స్థానం కోసం జరిగిన పోటీలో గద్వాల జట్టు వర్సెస్ మేడ్చల్ జట్ల మధ్య జరిగిన పోరులో 39-32 పోయింట్ల తేడాతో గద్వాల జట్టు మూడవ స్థానం కైవసం చేసుకుంది. విజేతలకు బహుమతులతో పాటు మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు ఒక లక్ష,రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు 75 వేలు,మూడవ స్థానంలో నిలిచిన జట్టుకు 50వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ అధికారి శెట్టి వెంకటేష్,జిల్లా విద్యాశాఖ అధికారి గోవింద రాజులు, మక్తల్ మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస, వైస్ ఛైర్మన్ శైవి రెడ్డి,బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య,చంద్రకాంత్ గౌడ్,నీల గౌడ్,రహీం పటేల్,కట్ట సురేష్,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి జిల్లాలోని పిడి,పిఈటి లు నాయకులు, కార్యకర్తలు వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్దమొత్తంలో పాల్గొన్నారు.

# కప్పం కట్టడం వల్లే సీఎం పోస్టింగ్, లేకుంటే ఎప్పుడో ఊస్టింగ్

- తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎం గా మార్చిన రేవంత్
- తాజాగా గాంధీ ఫ్యామిలీకి వెయ్యి కోట్లు ఇచ్చేలా ఎంవోయూ
- డబ్బు సంచులు మోయడం కోసం మూసీ సుందరీకరణ పేరుతో దోపిడీ పర్వం
- తెలంగాణ జనాన్ని కొట్టి బతకడం, ఢిల్లీలో దొంగ దొర్రై తిరగడం
- గల్లీలో ప్రశ్నించే వారిపై పోలీసు కేసులు, ఢిల్లీకి సూట్ కేసులు
- మొత్తం కేబినెట్ నే డిల్లీకి పిలిచి డబ్బు లు ఇవ్వాలని టార్గెట్లు
- హస్తినలో ఖద్దరు పెద్దలకు తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టు
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి




**హైదరాబాద్, ఫిబ్రవరి 23:**--ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సంపదను కొల్లగొట్టి క్రమం తప్పకుండా డిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టడం వల్లే ఆయన సీఎం పోస్టింగ్ ఉందని, లేకుంటే ఎప్పుడో ఊస్టింగ్ అయి ఉండేదని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి ఏఐసీసీకి ఏటీఎం గా మార్చారని ఆయన సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. తాజాగా గాంధీ ఫ్యామిలీకి వెయ్యి కోట్లు ఇచ్చేలా ఎంవోయూ కుదుర్చు కున్నారని ఆయన ఆరోపించారు. తన అవినీతి పాలనకు డిల్లీలో కొమ్ముగాస్తు న్న కేసీ వేణుగోపాల్ కోసం కేరళఎన్నికల్లో ఖర్చుచేయడం కోసం రేవంత్ రెడ్డి ఈ వెయ్యి కోట్ల రూపాయలను ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్లు ఏమిటి పదివేల కోట్లు ఇవ్వడానికి కూడా సిద్ధమని స్వయంగా రేవంత్ రెడ్డే చెప్పిన విషయాన్ని జీవన్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏఐసీసీ పెద్దలకు, ముఖ్యం గా గాంధీ కుటుంబా నికి నిధులు సమకూరుస్తోందనే ఆరోపణలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బలం చేకూర్చాయన్నారు. తెలంగాణ ప్రజల కష్టార్జితాన్ని ఢిల్లీకి 'కప్పం'గా కడుతు న్నారని, ఇది రాష్ట్ర ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ హైకమాండ్ తెలంగాణ ప్రభుత్వాన్ని ఢిల్లీకి పిలిపించుకుని తరచూ సమీక్షలు నిర్వహించడం, రాష్ట్ర నేతలను నిధుల సేకరణకు ఆదేశించడంపై రాష్ట్ర ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికు తోందన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు మళ్లీ అవమానమే ఎదురవు తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీకి డబ్బు సంచులు మోయడం కోసం మూసీ సుందరీకరణ పేరుతో దోపిడీ పర్వానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరదీసిందని ఆయన ధ్వజమెత్తారు. ఫ్యూచరు సిటీ, మూసీ నది సుందరీకరణ పేరుతో రేవంత్ రెడ్డి కుటుంబం రియల్ ఎస్టేట్ దందా చేస్తోందన్నారు. తెలంగాణ జనాన్ని కొట్టి బతకడం, ఢిల్లీలో దొంగ దొర్రై తిరగడం మాదిరిగా సీఎం రేవంత్ రెడ్డి తీరు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రశ్నించేవారిపై పోలీసు కేసులు , ఢిల్లీకి సూట్ కేసులు అన్న విధంగా ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని జీవన్ రెడ్డి దుయ్యబట్టారు. మొత్తం కేబినెట్ నే డిల్లీకి పిలిచి డబ్బులు ఇవ్వాలని టార్గెట్లు పెట్టడం ఏఐసీసీ అహంకారానికి నిదర్శనమనిఆయన అభివర్ణించారు. హస్తినలో ఖద్దరు పెద్దలకు తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టుపెట్టిన తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డి అని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# "బాల్య వివాహ ముక్త భారత్" ప్రచార రథానికి ఘన ప్రారంభం

- జిల్లా కలెక్టర్.



**జనగాం ఫిబ్రవరి23( సమయం న్యూస్).:** ఈరోజు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, స్కోప్ స్వచ్ఛంద సంస్థ (సొసైటీ ఫర్ ప్రోగ్రెసివ్ యాక్షన్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్) సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న "బాల్య వివాహ ముక్త భారత్" ప్రచార రథాన్ని గౌరవ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, వాటి నిర్మూలన కోసం ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు మరియు సమాజం సమిష్టిగా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో పాల్గొని సంతకం చేశారు. ఈ "బాల్య వివాహ ముక్త భారత్" ప్రచార రథం జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాలు ఎక్కువగా ఉన్న సుమారు 50 గ్రామాలు, హాట్‌స్పాట్ ప్రాంతాలు మరియు ఆసుపత్రి పరిసరాలలో, కాలనీల్లో పర్యటిస్తూ, ప్రజలకు బాలల హక్కులు, బాల్య వివాహ నిరోధక చట్టం, ఇతర బాలల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ (1098) పై విస్తృత ప్రచారం చేస్తుంది. కార్యక్రమం ముగింపులో బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు."ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి కోదండరాములు మాట్లాడుతూ, బాల్య వివాహ నిర్మూలనలో ప్రభుత్వం--స్వచ్ఛంద సంస్థలు--సమాజం కలిసి పని చేస్తేనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు పూర్తిగా నిర్మూలించే దిశగా ఈ ప్రచార రథం ఒక కీలక అడుగుగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కోదండరాములు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి కుమారస్వామి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, రాజూరాజు చీ+రా ప్రతినిధి మనోజ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్లు సంపత్, రాజు, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ రవికుమార్, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ శేఖర్, సఖి సెంటర్ నిర్వాహకురాలు రేణుక, జిల్లా మల్ల మహిళా సాధికారత యూనిట్ కోఆర్డినేటర్ శారద, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ సుధ, అలాగే డీసీపీయూ , చైల్డ్ హెల్ప్‌లైన్, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ శ్రేయస్సు మరియు స్థితిస్థాపకత (RPRP) కార్యక్రమం

- పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అభివృద్ధి అంతరం తగ్గింపే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగాం ఫిబ్రవరి23( సమయం న్యూస్).:** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ ఆధునీకరణ ద్వారా వలసలను తగ్గించి, ఆర్థిక స్థిరత్వాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమం... గ్రామీణ శ్రేయస్సు మరియు స్థితిస్థాపకత కార్యక్రమం గ్రామీణ సమృద్ధి మరియు స్థితిస్థాపకత కార్యక్రమం ద్వారా...గ్రామీణ ప్రాంతాల్లో విస్తారమైన అవకాశాలను సృష్టించి తద్వారా వలసలను తగ్గించడం, గ్రామీణ మహిళలు, యువ రైతులు, గ్రామీణ యువత, సన్నకారు, చిన్న రైతులు, భూమిలేని కుటుంబాలపై దృష్టి పెట్టడం,మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం, ఆర్థిక సహాయం అందించడం తదితర కార్యక్రమాలను చేపట్టి...పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అభివృద్ధి అంతరాన్ని తగ్గించడమే లక్ష్యం కాగా... మొదటి దశలో 5 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయగ...అందులో దక్షిణ భారత దేశం నుండి కేవలం జనగాం జిల్లా ఎంపిక కావడం విశేషం ఈ నేపథ్యంలో కేంద్రం నుండి... ఎషియాన్ డెవలప్మెంట్ బ్యాంకు, బోష్టన్ కన్సల్టేన్సీ ప్రతినిధులు సోమవారం జిల్లా లో ఉన్న స్థితి గతులను అధ్యయనం చేసేందుకు విచ్చేసారు ముందుగా... జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను ఛాంబర్ లో మర్యాద పూర్వకం గా కలిశారు అనంతరం వ్యవసాయ, మార్కెటింగ్, హ్యాండ్లుమ్, పరిశ్రమలు, డిఆర్డీఏ తదితర శాఖలకు సంబందించిన అధికారులతో కలెక్టరెట్ లోని మినీ కాన్ఫెరెన్స్ హల్ లో సమావేశమయ్యారు ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్. .. ముందుగా జిల్లా ఆవిర్భావం, భౌగోళిక పరిస్థితులు అలాగే వివిధ శాఖల ద్వారా అమలు అవుతున్న కేంద్ర, రాష్ట్ర పథకాల పురోగతి గురించి ప్రతినిధులకు వివరించారుఅనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు కూడా తమ పరిధిలో కేంద్ర, రాష్ట్ర పథకాలని ఏవిధం గా అమలు చేస్తున్నారనే అంశాలను తెలపగ..ఇంకా పురోగతి కి కావలిసిన సహకారాలను ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారుమొత్తం 5 రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన కేంద్ర బృందం క్షేత్ర స్థాయి పరిశీలనలు చేసి.. జిల్లా లో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పథకాల ను అవగతం చేసుకొని... మరింత పురోగతి కి కావలిసిన సలహా, సూచనలను తెలియజేయనున్నారు ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఎషియాన్ డెవలప్మెంట్ బ్యాంకు , బోష్టన్ ప్రతినిధులు సునయ్ కీమ్ ( ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంకు )అపర్ణ,హర్షద్,ఆనంద్,అంకిత్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు

# ప్రజావాణి పిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ఫిబ్రవరి23( సమయం న్యూస్).** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో ఆయన పాల్గొని ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్ లో ఉన్న పిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ద పెట్టి పరిష్కరించాలని అలాగే రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 48 దరఖాస్తులు,జిల్లా పంచాయతీ అధికారి 8, వైద్య ఆరోగ్య శాఖ అధికారి 7, డి ఆర్ డి ఓ 6 మిగిలిన 30 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 99 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ కే. సీతారామారావు , మహిళా, శిశు సంక్షేమ అధికారి కే. నర్సింహారావు,,డి ఎస్ సి డి ఓ కే. దయానంద రాణి,,డి ఈ ఓ ఆశోక్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శంకర్, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్ అధికారులు, సిబ్బంది, హాజరైనారు

## ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న తెలంగాణ క్రీడా శాఖ

- స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ అథ్లెట్స్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ




**మహబూబాబాద్ ఫిబ్రవరి23( సమయం న్యూస్) :** మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ పనిచేస్తోందని, అందులో భాగంగానే క్రీడాకారులకు క్రీడా సామాగ్రి పంపిణీ జరుగుతోందని మహబూబాబాద్ జిల్లా క్రీడా, యువజన సంక్షేమ అధికారి శ్రీమతి జ్యోతి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో జాతీయ స్థాయిలో రాణిస్తున్న అథ్లెట్ క్రీడాకారులకు సోమవారం ప్రత్యేక స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహబూబాబాద్ జిల్లా క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ఐఏఎస్, స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి ఐఎఫ్ఎస్ సహకారంతో క్రీడా సామాగ్రి అందజేయడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఇందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ జిల్లా సీఎం కప్ స్పెషల్ ఆఫీసర్ నందకిషోర్ గోకుల్ మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవిలు క్రీడల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో మరింత మెరుగ్గా రాణించేందుకు తమ విజ్ఞప్తి మేరకు ప్రత్యేక స్పోర్ట్స్ కిట్లు మంజూరు చేయడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని క్రీడాకారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జిల్లా యువజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.



**భూపాల పల్లి ఫిబ్రవరి23( సమయం న్యూస్) :** సోమవారం ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 44 దరఖాస్తులు స్వీకరించి తక్షణ చర్యలకు సంబంధించిన అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ఆయా దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు జాప్యం చేయక తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులు వచ్చే ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు ఇస్తున్నారని, అందువల్ల అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిగిలిన ఇందిరమ్మ ఇళ్లకు తక్షణమే మార్క్ అవుట్ పూర్తిచేయండి

- బేస్ లెవెల్ నుండి రూఫ్ కాంక్రీట్ దశ వరకు పనులను వేగవంతం చేయాలని
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి ఫిబ్రవరి23( సమయం న్యూస్).:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సోమవారం ఐడిఓసి కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, పీఆర్, మున్సిపల్, ఎంపిడివోలతో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గ్రౌండింగ్ మరియు 2బీహెచ్‌కే గృహాల సముదాయాల పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వారీగా పురోగతిని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 4165 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, అందులో 58 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 4107 ఇళ్లలో 898 ఇళ్లు ప్రారంభ దశలో, 582 బేస్ లెవెల్ దశలో, 1092 రూఫ్ లెవెల్ దశలో, 481 రూఫ్ కాంక్రీట్ దశలో ఉండగా, 1054 ఇళ్లకు మార్క్ అవుట్ చేయాల్సి ఉందని తెలిపారు. లబ్ధిదారులను సమన్వయం చేస్తూ పనులు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని, అర్హులైన ప్రతి నిరూపేదకు గృహం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. యంత్రాంగం సమన్వయంతో పని చేసి, మంజూరైన ఇళ్లన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, అన్ని మండలాల ఎంపిడివోలు, గృహ నిర్మాణ శాఖ డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి ఫిబ్రవరి23( సమయం న్యూస్) :** సోమవారం ఐడిఓసి కార్యాలయంలో 10 వ తరగతి పరీక్షలు నిర్వహణపై విద్యాశాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, వైద్య, సమాచార, పంచాయతి రాజ్, రవాణా, విద్యుత్తు, ఆర్టీసీ, ట్రెజరి, పోస్టల్, మున్సిపల్ అధికారులతోసమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 2026లో పరీక్షలు నిర్వహణకుతెలంగాణ ప్రభుత్వ పరీక్షల నియంత్రణాధికారి, హైదరాబాద్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు 14-03-2026 నుండి 16-04-2026 వరకు జరుగనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు.పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ప్రశ్నాపత్రాల రవాణా మరియు భద్రత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశ్న, జవాబు పత్రాలు తరలించాలని సూచించారు. జిల్లాలో 21 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహణకు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యవేక్షణకు ఫ్లైయింగ్ స్కాడ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసి వేయాలని,144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అత్యవసర సేవలకు వైద్య కేంద్రాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, అలాగే 108 వాహనాలు, ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర వార్డులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి అనువుగా అదనపు బస్సులు నడపాలని తెలిపారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, డీఈఓ రాజేందర్, వైద్యాధికారి మధుసూదన్, ఆర్టిఓ సంధాని, ఆర్టీసీ డిఎం ఇందు, డిపిఓ శ్రీలత, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రానున్న గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ ఫిబ్రవరి23( సమయ్దం న్యూస్).:** రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం సాయ ంత్రం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ గోదావరి నది పుష్కరాల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, రాబోయే గోదావరి నది పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే సంబంధిత అధికారులు అందరితో, పుష్కరాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించినట్లు వివరించారు. బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం, పుష్కర ఘాట్ వద్దకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, దానికి తగ్గట్టుగానే ఏర్పాట్లను చేస్తామని చెప్పారు. ప్రతి పుష్కర ఘాట్ వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల గకుండా, ఘాట్ ల నిర్మాణం, నీటి వసతి, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర వసతులు క ల్పిస్తామని తెలిపారు. ఈ వీసీలో డిపిఓ శ్రీనివాస్, నీటిపారుదల ఈఈ అనిల్, జెడ్పీ సీఈవో గోవింద్, ఈఈ ఆర్ డబ్ల్యుఎస్ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి

● (SCERT)ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పప్పెట్రీ పోటీలు

● ప్రథమ స్థానం సాధించడం జిల్లాకు గొప్ప గర్వకారణం-జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి (SCERT) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పప్పెట్రీ పోటీలలో నారాయణపేట జిల్లా ఉపాధ్యాయులు ప్రథమ స్థానం సాధించడం జిల్లాకు గొప్ప గర్వకారణమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ఘన విజయం సాధించిన శ్వేతా,ఎంపిపిఎస్ కమ్మాన్‌పల్లి మరియు అంబిక, కుర్వవాడ,ధన్వాడ ని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా తన చాంబర్‌కు పిలిపించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఉపాధ్యాయులు చూపిన సృజనాత్మకత, అంకితభావం మరియు వినూత్న బోధనా పద్ధతులు జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చాయని ప్రశంసించారు. పప్పెట్రీ వంటి సృజనాత్మక విద్యా విధానాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం,వ్యక్తీకరణ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. ఇలాంటి విజయాలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలిచి జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లాలో అమలవుతున్న యంగ్ ఓరేటర్స్ క్లబ్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆంగ్ల భాషా సామర్థ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు ధైర్యాన్ని పెంపొందిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర వికాసానికి బలమైన పునాదిగా నిలుస్తాయని, ఇదే ఉత్సాహంతో ముందుకు సాగితే నారాయణపేట జిల్లా విద్యారంగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే ఈ విజయానికి మార్గనిర్దేశం చేసిన జిల్లా విద్యాశాఖాధికారి ని కూడా కలెక్టర్ అభినందిస్తూ,ఉపాధ్యాయులను ప్రోత్సహించే నాయకత్వం జిల్లాలో సృజనాత్మక విద్యా వాతావరణాన్ని ఏర్పరుస్తోందని కొనియాడారు. కలెక్టర్ తన సందేశంలో ఇలా పేర్కొన్నారు: “ఉపాధ్యాయులు వెలిగితే విద్యార్థి వెలుగుతాడు; విద్యార్థి వెలిగితే సమాజం అభివృద్ధి చెందుతుంది. ఈ విజయం నారాయణపేట జిల్లా విద్యా స్ఫూర్తికి ప్రతీక.” జిల్లాకు కీర్తి తీసుకువచ్చిన విజేత ఉపాధ్యాయులు మరియు వారిని మార్గనిర్దేశం చేసిన విద్యాశాఖాధికారికి జిల్లా పరిపాలన తరపున మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# వడగండ్ల వర్షం... పంటలు నేలమట్టం



**రాయపోల్ ఫిబ్రవరి 23:** రాయపోల్ మండల కేంద్రంలో సోమవారం అకస్మాత్తుగా ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసి రైతులకు భారీ నష్టం కలిగించింది. కొద్ది నిమిషాలపాటు కురిసిన ఈ వర్షం తీవ్ర ప్రభావం చూపి పలు పంటలను నేలకూల్చింది. ముఖ్యంగా పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలు గాలివానకు తట్టుకోలేక నేలమట్టమయ్యాయి. పలు రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతినగా,మరికొన్ని ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. అకస్మాత్తుగా కురిసిన వడగండ్ల వర్షంతో పెట్టిన పెట్టుబడులు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోత దశలో ఉండగా ఈ నష్టం మరింత భారంగా మారిందని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వికారాబాద్ పోలీసుల ప్రభంజనం,

● 15 పతకాలు స్వాధీనం,విజేతలను అభినందించిన ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపిఎస్.







**వికారాబాద్, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** ఇటీవల సైబరాబాద్ వేదికగా నిర్వహించిన ‘4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ ఒ స్పోర్ట్స్ మీట్-2026’ లో చార్మినార్ జోన్ తరపున పాల్గొని, అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా పోలీస్ అధికారులను మరియు సిబ్బందిని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపిఎస్ ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్రీడా పోటీల్లో వికారాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొని మొత్తం 15 పతకాలను (1 గోల్డ్, 7 సిల్వర్, 7 బ్రాంజ్) సాధించి జిల్లా ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో చాటారు. ముఖ్యంగా, అథ్లెటిక్స్ విభాగంలో కె. స్వాతి హైజంప్‌లో బంగారు పతకం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. వెండి పతకాలు సాధించిన వారిలో బాడ్మింటన్ డబుల్స్‌లో (డీ సీ ఆర్ బీ) సిఐపి నవీన్ కుమార్, వెయిట్ లిఫ్టింగ్ (60 కెజి)లో కె. స్వాతి, ఆర్మ్ రెస్లింగ్ (100 కెజి)లో బి.నర్సింహులు, ఆర్మ్ రెస్లింగ్ (85 కెజి)లో మహేందర్, ఆర్మ్ రెస్లింగ్ (60 కెజి) మరియు టేక్వాండో (60 కెజి) విభాగాల్లో శ్రీనివాస్, బాక్సింగ్ (65 కెజి)లో రెహమతుల్లాలు ఉన్నారు. అలాగే, కాంస్య పతక విజేతలలో ఆర్మ్ రెస్లింగ్ (65 కెజి)లో బి. కావ్య, ఆర్మ్ రెస్లింగ్ (55 కెజి)లో స్వాతి, వాటర్ స్పోర్ట్స్ (కనోయింగ్ 200 మీటర్లు)లో మన్సూర్, స్విమ్మింగ్ (100 మీటర్లు)లో రవీందర్, హ్యామర్ త్రోలో జై ఆనంద్, బాక్సింగ్ (70 కెజి)లో ప్రకాష్ మరియు మహిళల ఖో-ఖో జట్టు (3వ స్థానం) నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ “నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణలో బిజీగా ఉంటూ, విధి నిర్వహణలో ఎంతో ఒత్తిడి ఎదుర్కొంటున్నప్పటికీ, క్రీడల పట్ల మక్కువతో సమయం కేటాయించి పతకాలు సాధించడం నిజంగా గర్వకారణం. ఒక పోలీస్ అధికారికి వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం చాలా ముఖ్యం. క్రీడలు ఈ రెండింటిని పెంపొందించడమే కాకుండా మనలో టీమ్ వర్క్ (జట్టు స్ఫూర్తి) మరియు క్రమశిక్షణను నింపుతాయి. గెలుపోటముల కంటే క్రీడల్లో పాల్గొనడం, మన ప్రతిభను నిరూపించుకోవడం ముఖ్యం. ఈ గెలుపు కేవలం మీకు మాత్రమే కాదు, చార్మినార్ జోన్ మరియు వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ మొత్తానికి గర్వకారణం” అని, మీరు సాధించిన ఈ పతకాలు తోటి సిబ్బందికి పెద్ద స్ఫూర్తినిస్తాయి. భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు జిల్లా పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం ఉంటుందని, జాతీయ స్థాయిలో కూడా మన జిల్లా పేరు మారుమోగేలా మీరు కృషి చేయాలని” ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆర్. ఐ డేవిడ్ విజయ్ కుమార్,డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# జలమండలిలో ఇష్టారీతిన బదిలీలు

- ● బదిలీలలో పైరవీలకు పెద్ద పీట
- ● మహిళా ఉద్యోగులు శివారు ప్రాంతాలకు బదిలీ
- ● ట్రాన్స్ మిషన్, ప్రాజెక్టు ల జోలికి వెళ్ళని అధికారులు
- ● వాటి జోలికి వెళ్లకపోవడంలో ఆంతర్యం ఏంటి
- ● మానసిక వేదనకు గురైతున్న అధికారులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23(సమయం న్యూస్) :** వడ్డించే వాడు మనవాడు అయితే చాలు మనం ఎక్కడ కూర్చున్న మనకు కావాల్సింది వస్తుంది అన్న సామెత జలమండలి కి సరిగ్గా సరిపోతుంది. సంస్థలో పని చేస్తున్న డిజిఎంల బదిలీలు చేపట్టారు. కానీ ఇది సహేతుకంగా జరగలేదని స్పష్టంగా తెలుస్తుంది. బదిలీల ప్రక్రియలో వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారు ఇచ్చిన అప్షన్స్ ప్రకారం బదిలీ నిర్వహించాలి. కానీ అలా కాకుండా పైరవీకారులకు మంచి పోస్టింగ్ అది లేనివారికి ఇష్టారీతినా పోస్టింగ్ ఇవ్వడం జరిగింది. ఇక మహిళా అధికారుల పరిస్థితి అయితే దారుణం. వారిని శివారు ప్రాంతాలకు పంపించారు. దూర ప్రాంతాల్లో పోస్టింగ్ దానికి తోడుగా మేనేజర్ పోస్టును వీరే నిర్వహించాల్సి రావడంతో వారు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురవుతున్నారు. జలమండలి బస్తీ బాట కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంబించింది. ఇందుకు అధికారులు ఉదయం 7గంటల వరకు క్షేత్రస్థాయిలో ఉండాలి అనేది నియమం. కానీ ఇప్పుడు చేసిన బదిలీల వలన వారు చాలా ఇబ్బందులకు గురైతున్నారు. తమ పై స్థాయి అధికారుల పరిస్థితి అలా ఉంటే తమ పరిస్థితి ఎలా ఉండబోతుందో అని భయంలో పడ్డారు మేనేజర్లు. ఒక సంస్థలో బదిలీలు అంటే అన్ని డిపార్ట్మెంట్ లను పరిగణలోకి తీసుకుని బదిలీలు చేపడతారు కానీ జలమండలిలో అలా జరగదు. ఇంత మందిని బదిలీ చేసినా ట్రాన్స్ మిషన్ లో మాత్రం ఏ ఒక్కరిని కదపలేరు. ట్రాన్స్ మిషన్ లో పని చేస్తున్నావారు పబ్లిక్ కమిషన్ ద్వారా 2009 లో అక్కడే అపాయింట్ అయి.. అక్కడే మేనేజర్లు, డిజిఎం మరియు జి ఎం లు అయినారు. అంటే వాళ్లు ఎన్నేళ్ల నుండీ అక్కడ పాగా వేశారో అర్థమవుతుంది. మెయింటనెన్స్ మాత్రమే ప్రతి మూడేండ్లకు బదిలీలు చేయాలని ట్రాన్స్ మిషన్ మరియు ప్రాజెక్ట్ లో బదిలీలు చేయవద్దని ప్రభుత్వం ఏమైనా జీవో ఇచ్చిందా.. మరి ఎందుకు అధికారులు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారు. వెంటనే ట్రాన్స్ మిషన్, ప్రాజెక్ట్ లో బదిలీలు చేపట్టాలి, లేకపోతే అందులో ఏదో గూడుపుటాని ఉందని ప్రజలందరికి తెలిసే పరిస్థితి వస్తుంది.

# కొంపల్లి సర్కిల్ లో సి ఎం సి కమిషనర్ ఆకస్మిక పర్యటన

● ప్రతి రోజూ డోర్-టు-డోర్ చెత్త సేకరణ చేయాలని ఆదేశం

● ట్యాక్స్ వసూళ్ల లో పురోగతి సాధించాలి.

●అధికారులకు కమిషనర్ ఆదేశం



**హైదరాబాద్, ఫిబ్రవరి 23(సమయం న్యూస్) :** కొంపల్లి సర్కిల్ పరిధిలో కమిషనర్ సృజన ఆకస్మిక పర్యటన నిర్వహించి పారిశుద్ధ్య నిర్వహణ, డోర్-టు-డోర్ చెత్త సేకరణ, ఆస్తి పన్ను వసూళ్లు, ట్రేడ్ లైసెన్సుల జారీ వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పలు ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులను పరిశీలించి, లోపాలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ ఆటో కార్మికులు ప్రతి రోజూ తప్పకుండా ప్రతి ఇంటికి వెళ్ళి చెత్త సేకరణ చేసేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. చెత్త సేకరణ వాహనాల జిపిఎస్ మానిటరింగ్‌ను కట్టుదిట్టం చేసి, పనితీరును ప్రతిరోజూ సమీక్షించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు, పనితీరు మరియు సూపర్వైజర్ల పర్యవేక్షణలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. సిబ్బంది అందుబాటులో లేకపోతే వెంటనే భర్తీ చర్యలు చేపట్టి,ఎక్కడ చెత్త పేరుకుపోకుండా చూడాలని ఆదేశించారు. వాణిజ్య సంస్థల వద్ద ట్రేడ్ లైసెన్సుల జారీ, పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని, పెండింగ్ బకాయిలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని పేర్కొన్నారు. డిజిటల్ పద్ధతుల ద్వారా పన్నుల చెల్లింపును ప్రోత్సహించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా, పారిశుద్ధ్య సమస్యలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించేలా వార్డు స్థాయిలో మానిటరింగ్ను బలోపేతం చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో సంబంధిత డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టపగలే వ్యక్తి దారుణ హత్య





**కరణ్ కోట్ మండలం, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరణ్ కోట్ గ్రామములో సోమవారం పట్టపగలే దారుణం చోటుచేసుకుంది. స్థానిక ఆటో డ్రైవర్ సాయిలు (45)ను టైలర్ పాండు యువకుడు కత్తితో వెంబడించి మరీ కిరాతకంగా నరికి చంపాడు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. పాత కక్షలా లేక మరేదైనా కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నా పోలీసులు.

# తలుపులేని గ్రామ పంచాయితీ బాత్రూం.

● అభివృద్ధి ఎక్కడ...?





**రాయపోల్,ఫిబ్రవరి 22:** రాయపోల్ మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీలో అభివృద్ధి నినాదాలు కాగితాలకే పరిమితమయ్యాయని స్థానికులు విమర్శిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉన్న బాత్రూంకే తలుపు లేకపోవడం పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చెప్పకనే చెబుతోంది. బాత్రూం కు తలుపు లేకపోవడంతో తాత్కాలికంగా పరదా కట్టి వినియోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని,దేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తోందని పాలకులు,నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నా, గ్రామ స్థాయిలో కనీస వసతులు కూడా లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తిస్తోంది. ప్రభుత్వ కార్యాలయం అయిన గ్రామ పంచాయతీలోనే ఇలాంటి పరిస్థితి ఉండటం అధికారులు,ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ పనుల కోసం పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలు,సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలకు ఇబ్బందులు మరింత ఎక్కువగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉన్న అధికార యంత్రాంగం ఈ సమస్యపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బాత్రూంకు తలుపు ఏర్పాటు చేసి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అభివృద్ధి మాటల్లోనే కాకుండా గ్రామాల్లోనూ కనిపించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మంతురులో అసంపూర్తిగా గ్రామపంచాయతీ భవనం

- పట్టించుకోని అధికారులు,ప్రజా ప్రతినిధులు.
- ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం.
- వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు వేడుకలు.



**రాయపోల్ ఫిబ్రవరి 23:** రాయపోల్ మండలం మంతూరు గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2016లో సుమారు రూ. 13 లక్షల నిధులతో ప్రారంభించిన ఈ భవనం ఇప్పటికీ పూర్తి కాలేక వాడుకలోకి రాకపోవడం గమనార్హం. భవనానికి స్లాబు, గోడలు,కిటికీలు మాత్రమే అమర్చిన స్థితిలో వదిలేయడంతో, అంతర్గత పనులు, ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ వంటి పనులు పూర్తికాక నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. భవనం పరిసర ప్రాంతాలు పిచ్చి మొక్కలతో నిండిపోవడం,భవనం పాడైపోయే పరిస్థితి నెలకొనడం గ్రామస్తుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రజల సౌకర్యాల కోసం నిర్మించాల్సిన పంచాయతీ కార్యాలయం ఇలా నిర్లక్ష్యానికి గురవడం పై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యకలాపాలు సరైన భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజాధనం ఖర్చు చేసినా ఫలితం లేకపోవడం పై బాధ వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ పనులను పూర్తి చేసి భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఫౌండేషనల్ అండ్ న్యూమారసీ సర్వేకు సంబంధించిన శిక్షణ కార్యక్రమన్ని ప్రారంభించిన జిల్లా విద్యాశాఖధికారిగోవిందరాజు



**నారాయణపేట, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** జిల్లాలో నిర్వహిస్తున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఖీూచీ) సర్వేకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి (ణజుూ) గోవిందరాజు సోమవారం కేజీబీవీ, నారాయణపేటలో ప్రారంభించారు. జిల్లాలో ప్రాథమిక విద్యా నాణ్యతను సమగ్రంగా అంచనా వేసి, విద్యార్థుల చదవడం--లెక్కించడం నైపుణ్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ సర్వే నిర్వహించబడుతున్నది. ఈ సందర్భంగా డీఈఓ గోవిందరాజు మాట్లాడుతూ,"సర్వే అనేది కేవలం ప్రక్రియ కాదు --- ఇది మన విద్యా వ్యవస్థకు అద్దం పట్టే సాధనం. ప్రతి ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ నిష్పక్షపాతంగా, ఎలాంటి లోపాలు లేకుండా సర్వే నిర్వహిస్తేనే నిజమైన ఫలితాలు వెలుగులోకి వస్తాయి. గత నాలుగేళ్లుగా మన జిల్లాలో నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాల ప్రభావం ఈ సర్వే ఫలితాల్లో ప్రతిబింబిస్తుంది. అందుకే ఇది అత్యంత బాధ్యతతో చేయాల్సిన కార్యం" అని స్పష్టం చేశారు. అలాగే ఆయన "ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని నిజాయితీగా నమోదు చేయడం ద్వారా మాత్రమే సరైన ప్రణాళికలు రూపొందించగలం. మీ కృషి భవిష్యత్తు తరాల అభ్యాసాన్ని ప్రభావితం చేస్తుంది" అని ప్రేరణాత్మకంగా పేర్కొన్నారు. ఈ శిక్షణను ఛాత్రోపాధ్యాయులు పొందుతున్నారు. వారికి సర్వే నిర్వహణ విధానం, ప్రశ్నాపత్రాల వినియోగం, డేటా నమోదు విధానం, సమయపాలన, విద్యార్థులతో స్నేహపూర్వకంగా వ్యవహరించడం వంటి అంశాలపై విపులంగా మార్గదర్శనం అందించారు. నిర్ణీత తేదీలలో కేటాయించిన పాఠశాలలను సందర్శించి సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సర్వే 2వ తరగతి విద్యార్థులకు తెలుగు, గణితం మరియు ఆంగ్లం విషయాలలో నిర్వహించబడుతుంది. శిక్షణ కోర్సు డైరెక్టర్ విద్యాసాగర్ ఏఎంఓ(ూమీూ) మాట్లాడుతూ, శిక్షణతో పాటు సర్వేను కూడా అత్యంత బాధ్యతతో నిర్వహించాలని అన్నారు. సర్వే టూల్‌లోని ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని, అప్పుడు మాత్రమే సేకరించే సమాచారం ఖచ్చితంగా ఉంటుందని తెలిపారు. ఎంపిక చేయబడిన 68 పాఠశాలల్లో ఈ సర్వేను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని చెప్పారు.

**సర్వే తేదీలు:** ఫిబ్రవరి 25 -- తెలుగు ఫిబ్రవరి 26 -- గణితంఫిబ్రవరి 27 -- ఆంగ్లంపాల్గొన్న ఛాత్రోపాధ్యాయులు: దత్త బృందావన బీ.ఎడ్ కళాశాల మరియు ఆదర్శ బీ.ఎడ్ కళాశాల విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొని, సర్వే నిర్వహణకు సిద్ధమవుతున్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఛాత్రోపాధ్యాయులు మరియు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గుడిసెలు వేసుకున్న పేదవారందరికీ పట్టాలు ఇవ్వాలి.

- గుడిసెల కాలనీలోమౌలిక సదుపాయాలు కల్పించాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్
- కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా




**చేవెళ్ల ఫిబ్రవరి 23: (సమయం న్యూస్) :** చేవెళ్ల పట్టణంలో సర్వే నెంబరు 75 లోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూములు 2022 లో నియోజకవర్గంలోని నిరుపేదలందరూ కలిసి సిపిఐ జెండా పట్టుకొని గుడిసెలు వేసుకున్నారు నాలుగు సంవత్సరాలు అయినా నేటికీ పట్టాలు ఇవ్వలేదని వారందరికీ ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని వారు నివాసం ఉండే గుడిసెల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య డిమాండ్ చేశారు శంకర్పల్లి మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 500 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు కానీ స్థలాలు నేటికి చూపించలేదు చేవెళ్లలో పట్టాలు ఇవ్వాలి శంకర్పల్లిలో ఇండ్ల స్థలాలు చూపించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ చేవెళ్ల నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జి కే రామస్వామి అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ఈ ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకోవడం కాదు చిత్తశుద్ధి ఉంటే చేవెళ్ల పట్టణంలో పేదలు గుడిసెలు వేసుకొని నాలుగు సంవత్సరాలుగా ఇంటి స్థలం సర్టిఫికెట్ కోసం ఎదురుచూస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారందరికీ పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు మోకిలా పొన్నగుట్ట తండాలో గిరిజన రైతుల భూములను ల్యాండ్ పోలింగ్లో తీసుకున్న ప్రభుత్వం వారికి కేటాయించాల్సిన 800 గజాల స్థలాన్ని ఇవ్వకుండా వీరి పేరుతో ఉన్న భూమికి సంబంధం లేని వ్యక్తులకు ఎంజాయ్మెంట్ సర్వేలో వారి పేర్లను చేర్చి ఒరిజినల్ గిరిజన రైతులకు అన్యాయం చేయడం తగదని తక్షణమే ఒరిజినల్ రైతుల పేర్లను జాబితాలో చేర్చి ఎనిమిది వందల గజాల స్థలాన్ని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఈ ధర్నాలో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు ధర్నాలో మాట్లాడారు పేదలకు న్యాయం జరిగే వరకు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు లింగం వడ్ల సత్యనారాయణ బాతరాజు నరసింహ సిపిఐ చేవెళ్ల మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి మొయినాబాద్ మండల కార్యదర్శి కే శ్రీనివాస్ శంకర్ పల్లి మండల కార్యదర్శి పి సుధీర్ జిల్లా సమితి సభ్యులు మంజుల సుధాకర్ గౌడ్ సక్రు నాయక్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు గుడిసెలు వేసుకున్న నిరుపేదలు సుమారు 200 మంది ఈ ధర్నాలో పాల్గొన్నారు

# పర్సాపూర్ రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

- రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారిణి ఎన్. శ్రీలత



**కొడంగల్ మండలం, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** కొడంగల్ మండలం లోని పర్సాపూర్ గ్రామ రైతు వేదిక లో రైతులకు ప్రకృతి వ్యవసాయం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమలో మండల వ్యవసాయ అధికారి ఎన్.శ్రీలత ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమం ను నిర్వహిస్తున్నారని, ఈ ప్రాకృతిక వ్యవసాయం అనేది రసాయన ఎరువులు, కీటనాశకాలు లేకుండా సహజ పద్ధతులతో పంటలు పండించాలి అని, జీవామృతం, బీజామృతం , మల్చింగ్, అంతరపంటలు, పంటల మధ్య మధ్య పంటలు వంటి పద్ధతులు అవలంబించి నేల ఆరోగ్యాన్ని పెంచి, ఖర్చులను తగ్గిచాలని, ఈ విధానంతో రైతులు అధిక దిగుబడి పొంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పి. అశ్విని,గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పతాకాలపై అవగహన సదస్సు





**నారాయణపేట, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళ భవనం లో ఓఎంఎఫ్ఐ (ూవీ×ఖీ) (ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్) అధ్వర్యంలో ప్రభుత్వ పతాకాలపై అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహేసిల్దార్ అమరేందర్ కృష్ణ ఆర్ఐ మధుసుదన్, మున్సిపల్ చైర్మన్. కె శ్వేత సత్య యాదవ్, వైస్ చైర్మన్ మంజుల, కౌన్సిలర్లు నాగమ్మ ,సౌజన్య,మరియు మాజీ కౌన్సిలర్ కృష్ణ పాల్గొని మహిళలు చైతన్యం కావాలి ప్రతి మహిళ హక్కులు సాదించుకోడానికి కృషిచేయాలి ప్రతి రంగంలో ఇ రోజు మహిళలు ముందుంటున్నారు. ప్రభుత్వం కూడా మహిళలకు ఏక్కువ ప్రాధాన్యత ఇస్తుంది ప్రతి పథకం మహిళల పేరు పైనే ఇస్తుంది కావున మన పిల్లలను మంచిగా చదివించాలి చిన్న వయసులో పెళ్లీలు చేయరాదు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా మహిళలు అవకాశాలు కల్పించుకోవాలి అని చెర్మెన్ మాట్లాడటం జరిగింది. ఓఎం ఐఎఫ్ (ూవీ×ఖీ) జిల్లా. కోఆర్డినేటర్ హజమ్మ మాట్లాడుతూ జోగిని వ్యవస్థ నిర్మూలనకు. బాల్యవివాహాల. నిర్మూలనకు పేదల సంక్షేమం ఆరోగ్య సమస్యలు మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేయడానికీ సవస్థ కృషిచేస్తుండని మధ్యలో చదువుకోలేని ఆడపిల్లల కోసం ఒకేషనల్ కోర్సులు అందిస్తుందని మహిళలకు టైలరింగ్ సెంటర్స్ ఏర్పాటు చేసిందని మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. ఓఎంఐఎఫ్ మండల కోఆర్డినేటర్ ఆశమ్మ నర్సింలు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రజావాణికి 29 ఫిర్యాదులు

- అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన
- జరుపుతూ సత్వరమే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 29 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ విడుదల చేయాలి.

- పీఆర్సీని అమలు చేయాలి టిఎస్ యుటిఎఫ్ మండల
- అధ్యక్షు ప్రధాన కార్యదర్శిలు కామ్రేడ్ గౌరారం గోపాల్ ఎండి అలీముద్దీన్




**బొంరస్ పేట మండలం, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** బొంరస్ పెట్ పట్టణ కేంద్రంలోని పిఎం శ్రీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం దినచర్య పుస్తకాలను డైరీ,అధ్యాపకదర్శినిలను మండల విద్యాధికారి ఉపాధ్యాయులకు అందించారు. అనంతరం మండల విద్యాధికారి మాట్లాడుతూ టీఎస్ యుటిఎఫ్ వారు అందించిన దినచర్య పుస్తకాలలో,అధ్యాపకు దర్శినిలలో ఉపాధ్యాయుల, పాఠశాలల సమాచారంతో పాటు వివిధ జీవోల పూర్తి సమాచారం అందరికి ఉపయోగపడుతుందని,వారి సందేహాలను నివృత్తి చేయడంలో ఎంతో క్రియాశీలకం వహిస్తాయని తెలియజేశారు. అధ్యక్ష కార్యదర్శులు గౌరారం గోపాల్, ఎండి అలిముద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ఉద్యోగ, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని, పిఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని సంఘాలతో చర్చించి సమంజసమైన ఫిట్మెంట్ 2023 జులై 1 నుండి అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని తప్పుబట్టారు. 2024 మార్చి నుండి రిటైరైన ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, డిఎ వాయిదాలను విడుదల చేయాలని కోరారు. నూతన రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 కి అనుగుణంగా ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలను రూపొందించి డిఈఓ, డిప్యూటీ ఇఓ, ఎంఈఓ తదితర పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయడం ద్వారా విద్యా శాఖలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల సిఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, గురుకులాల్లో ఉపాధ్యాయులపై బోధనేతర పనుల బారం తగ్గించాలని డిమాండ్ చేశారు. టెట్ మినహాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అర్హత మార్కులను తగ్గించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎం రవీందర్ గౌడ్ జిల్లా కార్యదర్శిలు నడిమింటి మల్లేష్ శివరాజ్ మండల మహిళా నాయకురాలు లక్ష్మీ,శిరీష మండల కార్యవర్గ సభ్యులు మోహన్ మహేందర్ నరేందర్ గౌడ్ అన్వర్ ముదాసిర్ క్రిజర్, సిరాజ్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల మునిసిపాలిటీ పాలకవర్గ నికి సన్మాన సభ ఘనంగా జరిగింది



**చేవెళ్ల ఫిబ్రవరి 23: (సమయం న్యూస్) :** చేవెళ్ల చేవెళ్ల మున్సిపాలిటీలో గెలుపొంది సభ్యులకు కే.జి.ఆర్ గార్డెన్ లో జరిగిన సన్మాన సభలో తెలంగాణ ఐటి శాఖడరంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు , రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి , మాజీ పార్లమెంట్ సభ్యులు రంజిత్ రెడ్డి , చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య , హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ , ఝఖీ×ణజ చైర్మన్ చల్ల నరసింహారెడ్డి , మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి తో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి  పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్గ సభ్యులను మంత్రివర్యులు ఎమ్మెల్యే కలసి సన్మానించారు. చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య గారు మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గానికి అలాగే చేవెళ్ల మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందు ఉంచుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకటరెడ్డి, మిగతా వార్డు సభ్యులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్. ఎస్. ఎస్ జాతీయ సమైక్యతా శిబిరానికి అధ్యాపకుడు మరియు విద్యార్థి ఎంపిక

● డిగ్రీకలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్. బి.శ్రీనివాస్ రెడ్డి





**కొడంగల్ మున్సిపల్, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల,కు చెందిన చరిత్ర అధ్యాపకుడు మరియు ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రాం అధికారి డా. ఇ. సోమ్లా కర్ణాటక రాష్ట్రం రాయచూరు లోని ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి విశ్వ విద్యాలయంలో ఫిబ్రవరి 24నుండి మార్చి 2వ తేదీ వరకు జరిగే ఎన్. ఎస్. ఎస్ జాతీయ సమైక్యతా శిబిరానికి పాలమూరు విశ్వవిద్యాలయం తరపున కంటింజెంట్ అధికారిగా ఎంపికయ్యారని అదేవిధంగా కళాశాల బి. ఎ. హెచ్. ఈ. పి విద్యార్థి ఐ. ప్రవీణ్ కూడా ఈ కార్యక్రమానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటుగా వ్యాయామ విద్య,యోగా, వ్యక్తిత్వ వికాసం, విపత్తు నిర్వహణ, పరేడ్ వంటి కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలవల్ల విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, యాజమాన్య మరియు వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతాయని, వారు దేశంలోని విభిన్న రాష్ట్రాల విద్యార్థులతో కలిసి పనిచేయడం వల్ల, వివిధ రాష్ట్రాల భాషలు మరియు సంస్కృతుల అవగాహన ద్వారా దేశభక్తి పెంపొందడమే గాక దేశ సమగ్రతకు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం నుండి మొత్తం 10 మంది వాలంటీర్లు పాల్గొంటున్నారని వారికి తమ కళాశాల అధ్యాపకుడు కంటింజెంట్ అధికారి గా ఎంపికవడం తమ కళాశాలకు లభించిన గౌరవమని, విద్యార్థి కూడా ఎంపికవడం తమ కళాశాల ఎన్. ఎస్. ఎస్ అభ్యున్నతికి చిహ్నం అని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. ఇ. సోమ్లా మరియు విద్యార్థిని ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది అభినందించారు.

# రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు.



**చేవెళ్ల, ఫిబ్రవరి 23:( సమయం న్యూస్) :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని తంగడపల్లి గ్రామ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పూలపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ (35) తన భార్య రాణి (30) మరియు తన కూతురితో (4) బైక్ పై పూలపల్లి గ్రామానికి వెళుతుండగా ముందు గా వెళ్తున్న ఎడ్ల బండికి ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో భాస్కర్ తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య రాణికి తల పగిలి తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే ఆమెను మరియు తన 4 సంవత్సరాల పాపను అంబులెన్స్ లో శంకర్పల్లిలోని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు. రాణి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# “క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య భర్త మందలింపు కారణమా?”



**చేవెళ్ల, ఫిబ్రవరి: 23 ( సమయం న్యూస్) :** చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల పరిధిలోగల తాళ్లపల్లి గ్రామంలో క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. ఆశి గారి నరసింహులు(35), ఆశి గారి నందిని(27) కి 10 సంవత్సరాల వివాహం అయింది. ఈ దంపతులకు ఆరు(6) సంవత్సరాల బాలుడు కలడు.దినసరి వృత్తి నేపథ్యంలో నిన్న సాయంత్రం మార్కెట్కు వెళ్లిన భర్తకు కొడుకు అమ్మ కనిపించడం లేదు అని ఫోన్ చేసినట్లు స్థానికులు తెలిపారు. భర్త భార్య నందినికి ఫోన్ చేసి బాబు ఒక్కడిని ఇంట్లో పెట్టి ఎక్కడికి వెళ్ళినావు అని కొద్దిగా మందలించినట్లు ప్రాథమికంగా తెలిసింది.భర్త మందలింపుకు కొద్దిగా మానసికంగా కృంగిపోయిన నందిని క్షణిక ఆవేశంలో తోటి కోడలికి ఫోన్ చేసి బాబును మంచిగా చూసుకో అని చివరిగా మాట్లాడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు గ్రామస్తులు కనిపించకుండా పోయిన నందినిని వెతకగా చివరగా తాళ్లపల్లి గ్రామంలోని నాగుల చెరువులో తెల్లవారుజామున శవమై కనిపించిన నందినిని గుర్తించినట్లు పేర్కొన్నారు.వెంటనే షాబాద్ పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో నుండి శవాన్ని బయటికి తీసినట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి వుంది.

# మహిళల రక్షణ కోసం పోష్ చట్టం.. వాల్ పోస్టర్ రిలీజ్.

●కలెక్టర్ కార్యాలయంలో గోడ పత్రిక విడుదల

చేసిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా; పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గోడ పత్రిక విడుదల చేశారు.. లైంగిక వేధింపుల నిరోధక చట్టం--2013 ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమల్లో తప్పని సరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ICC- Internal Complaint Committee) ఏర్పాటు చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రైవేటు సంస్థలు వెంటనే ఐసీసీ ఏర్పాటు చేసి, పూర్తి వివరాలను షీబాక్స్ పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ రాజేందర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ మొగులప్ప, సీడీపీఓ సరోజినీ, మహిళా సాధికారికత కేంద్రం జిల్లా సమన్వయకర్త నర్సింహులు , జెండర్ స్పెషలిస్ట్ అనిత, నరసింహ,డీసీపీవో కరిష్మ పాల్గొన్నారు.



# నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ పురోగతి పై సమీక్ష

డిప్యూటీ సెక్రటరీ/అదనపు మిషన్ డైరెక్టర్ కటియార్



**నారాయణపేట, ఫిబ్రవరి,23(సమయం న్యూస్) :** నీతి ఆయోగ్ డిప్యూటీ సెక్రటరీ/అదనపు మిషన్ డైరెక్టర్ కటియార్ సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన నర్వ మండలంలో ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ ఏబిపి(ఊఝ) పురోగతిని సమీక్షించారు.అంతకుముందు కలెక్టర్ డిప్యూటీ సెక్రటరీకి స్వాగతం పలికారు. అనంతరం వీసీ హాల్ లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నర్వ మండలం వివరణాత్మక విభాగాల వారీగా పురోగతి నివేదికను సమర్పించారు.ఈ ప్రదర్శన వివిధ విభాగాలలోని కీలక పనితీరు సూచికలు, సవాళ్లు  ఉత్తమ పద్ధతులను హైలైట్ చేశారు.అట్టడుగు స్థాయిలో ఏ బి పి ని అమలు చేయడంలో ఉన్న సవాళ్లను అర్థం చేసుకోవడానికి డిప్యూటీ డైరెక్టర్ కటియార్ జిల్లా అధికారులతో సంభాషించారు.నీతి ఆయోగ్ మరియు సీ ఎస్ ఆర్ వనరుల నుండి అదనపు నిధులను పొందడానికి ఇన్నోవేషన్ కేటగిరీ కింద మరిన్ని ప్రతిపాదనలను సమర్పించాలని ఆయన కలెక్టర్ ను కోరారు. నారాయణపేట జిల్లా నుండి కొత్త మండలాలను ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద చేర్చాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలను మంజూరు చేస్తామని, వీలైనంత త్వరగా నిధులు విడుదల చేస్తామని డిప్యూటీ డైరెక్టర్ హామీ ఇచ్చారు. సమావేశంలో పోషన్ ట్రాకర్ లో డేటా అప్డేట్లు, పిల్లల కోసం ఆధార్ కార్డ్ జనరేషన్, ఫేస్ క్యాప్చర్ సవాళ్లకు సంబంధించిన సమస్యలను డీ డబ్ల్యు ఓ లేవనెత్తగా,నర్వలో జూనియర్ కళాశాల లేకపోవడం వల్ల ఇంటర్మీడియట్ విద్యార్థులు కనిపించకపోవడం వల్ల వారి పరివర్తన రేటు గురించి డీ ఈ ఓ గోవింద రాజులు సమస్యను ప్రస్తావించారు.నర్వ బ్లాక్కు నీతి ఆయోగ్ ఇన్నోవేషన్ కేటగిరీ కింద ప్రతిపాదన సమర్పించి ఆమోదించడం నిధులు మంజూరు చేయడం పట్ల డిప్యూటీ డైరెక్టర్  జిల్లా అధికారులు, నర్వ మండల అధికారులను అభినందించారు. ఈ సమీక్షలో శిక్షణా కలెక్టర్ ప్రణయ్ కుమార్, నీతి అయోగ్ రాష్ట్ర సమన్వయకర్త లోకేష్, డిఆర్డిఓ మొగులప్ప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, హౌసింగ్ పీడీ శంకర్, డిపివో సుధాకర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప అధికారి డాక్టర్ శైలజ, ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, నర్వ ఎంపీడీవో శ్రీనివాస్, సిడిపిఓ సరోజ, ఎంఈఓ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# షాబాద్ లో పట్నం రాజేందర్ రెడ్డి స్మారక క్రీడ పోటీలు..

● ప్రారంభించిన మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి

● రాజేందర్ రెడ్డి స్మారక మేఘా క్రీడా పోటీలు నిర్వహిస్తాం

● క్రీడా స్ఫూర్తితో యువత విజయాల వైపు అడుగులు వేయాలి

**శాబాద్, ఫిబ్రవరి 23(సమయం న్యూస్) :** క్రీడా స్ఫూర్తితో యువత విజయాల వైపు అడుగులు వేయాలని షాబాద్ మండల మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని పిఆర్ఆర్ స్టేడియంలో దివంగత మహానేత పట్నం రాజేందర్ రెడ్డి స్మారక 38వ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో షాబాద్ లో మెగా టోర్నమెంట్ నిర్వహిస్తామని చెప్పారు. క్రీడలు వ్యక్తిలో విజయకాంక్షను, పోరాట స్ఫూర్తిని, ఓర్పును, చాకచక్యం నేర్పిస్తాయని అవినాష్ రెడ్డి తెలిపారు. విజేతలైన జట్లకు మార్చ్1వ తేదీన రాజేందర్ రెడ్డి  వర్ధంతి సభలో నగదు బహుమతి, ట్రోఫీలను అందిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పీఆర్ఆర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జడల రాజేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్,మాజీ సర్పంచ్ వెంకట్ యాదవ్, కృష్ణ గౌడ్, రాజారత్నం, రాములు, దర్శన్ కుమ్మరి, కంకర్ వెంకటయ్య, రామచందర్, సర్పంచులు రాజయ్య, నర్సింలు, వార్డు సభ్యులు మజీద్, ముఖరమ్ ఖాన్,మాజీ ఉప సర్పంచ్ లు గోపాల్, సందీప్, రాజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ  నాయకులు, క్రీడల ఆర్గనైజర్లు రమేష్ యాదవ్,రవీందర్ గౌడ్ , క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహణ




**చేవెళ్ల, ఫిబ్రవరి 23: (సమయం న్యూస్) :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్  మండల కేంద్రంలో చేవెళ్ల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గారి ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఇన్స్పెక్టర్ గారు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించగలరని, అలాగే సీట్ బెల్టు ధరించగలరని సూచించారు.రాంగ్ రూట్, సిగ్నల్ జంపు, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపవలసిందిగా కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ గారు, సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.



# పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

-- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**కొత్తగూడెం ఫిబ్రవరి23( సమయం న్యూస్). :** మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా,  ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో పబ్లిక్ పరీక్షల నిర్వహణకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు, సి-సెంటర్ కస్టోడియన్లు, మండల విద్యాశాఖాధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పరీక్షలకు 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడతాయని వెల్లడించారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అత్యంత కీలక అంశం కావడంతో పరీక్షల నిర్వహణలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు మరియు సెంటర్ సూపరింటెండెంట్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారులు (వీఖూలు), రెవెన్యూ డివిజనల్ అధికారులు (=ఖూలు) తమ పరిధిలోని పరీక్షా కేంద్రాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలని సూచించారు.గతంలో చోటుచేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశ్నపత్రాల భద్రత, రవాణా, భద్రపరిచే విధానం, సమయపాలన వంటి అంశాల్లో ఎటువంటి లోపం ఉండకూడదని స్పష్టం చేశారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో  సెక్షన్ 163 బి ని అమలు చేయడంతో పాటు, పోలీస్ శాఖ ద్వారా పర్యవేక్షణను బలోపేతం చేయాలని అన్నారు . కాపీచేసే చర్యలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక  ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు పరిశీలక బృందాలను నియమించాలని ఆదేశించారు.విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అనుకూల పరిస్థితులు కల్పించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, సరిపడ ఫర్నిచర్, పరిశుభ్రమైన మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు రైటర్ సౌకర్యం, ర్యాంపులు తదితర అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.అన్ని పరీక్షా విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది విధిగా తమ ఐడీ కార్డులను ధరించాలని కలెక్టర్ స్పష్టంగా ఆదేశించారు. ఐడీ కార్డు లేకుండా ఎవరినీ పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించరాదని ఆదేశించారు .చీఫ్ సూపరింటెండెంట్లు ప్రభుత్వ నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలలో మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధించబడినవని, నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్, పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మేము వచ్చింది కేవలం ఆడటానికి కాదు..

# గెలవడానికి!

### టీమిండియాకు సికందర్ రజా మాస్ వార్నింగ్..

**ఢిల్లీ:** టీ20 ప్రపంచకప్‌లో సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. సూపర్-8 దశలో దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడిపోయిన టీమిండియా ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిలో ఉంది. భారత్ సెమీఫైనల్‌కు వెళ్లాలంటే తదుపరి మ్యాచులు కచ్చితంగా గెలవాల్సిందే. ఈ తరుణంలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

#### భారత్‌కు రజా ఇచ్చిన మెసేజ్ ఏంటి..

చాలా ఏళ్లుగా జింబాబ్వే భారత్‌లో టీ20 మ్యాచ్‌లు ఆడలేదు. అయితే, దీన్ని ఒక సాకుగా తాము చూపించబోమని సికందర్ రజా స్పష్టం చేశారు. "పరిస్థితులు ఎలా ఉన్నా, పిచ్ చిన్నదైనా పెద్దదైనా.. రెండు జట్లకు ఒకేలా ఉంటుంది. భారత్ విసిరే సవాలును స్వీకరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని ఆయన గంభీరంగా ప్రకటించారు. ఒకప్పుడు బలహీనమైన జట్టుగా భావించిన జింబాబ్వే, ఈ ప్రపంచకప్‌లో అద్భుతాలు చేస్తోంది. గ్రూప్ దశలో శ్రీలంక, ఆస్ట్రేలియా వంటి దిగ్గజ జట్లను ఓడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు సూపర్-8లో భారత్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ వంటి బలమైన జట్లతో తలపడాల్సి ఉన్నా.. ఆ జట్టు ఆత్మవిశ్వాసం ఏమాత్రం తగ్గలేదు.

#### సెమీఫైనల్ రేసుపై రజా ఏమన్నారంటే..

జింబాబ్వే సెమీఫైనల్‌కు చేరుకుంటుందని ఎవరూ ఊహించలేదని రజా నవ్వుతూ అన్నారు. "మమ్మల్ని ఎవరూ టాప్-4లో ఉంటారని అనుకోలేదు. కానీ ఆ సవాలే మాలో కసిని పెంచుతోంది. మేము కేవలం టోర్నీలో పాల్గొనడానికి రాలేదు, పూర్తి శక్తితో పోటీ పడి గెలవడానికి వచ్చాం" అని టీమ్ ఇండియాకు పరోక్షంగా హెచ్చరిక జారీ చేశారు. ఒకవేళ భారత్ గనుక జింబాబ్వేను తక్కువ అంచనా వేస్తే.. సెమీఫైనల్ ఆశలు గల్లంతయ్యే ప్రమాదం ఉందని క్రీడావిశ్లేషకులు చెబుతున్నారు.

# వైభవ్ సూర్యవంశీకి టాటా మోటార్స్ స్పెషల్ గిఫ్ట్..

### టాటా కర్వ్ ఎస్‌యూవీ కారు బహుకరణ

బీహార్‌కు చెందిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో క్రికెట్ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందాడు. ముఖ్యంగా ఐపీఎల్2025 సీజన్ లో అత్యధిక స్ట్రైక్‌రేట్ నమోదు చేసి "కర్వ్ సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్" అవార్డును గెలుచుకున్నాడు. దీనితో ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టాటా మోటార్స్ అతనికి ప్రత్యేక బహుమతిగా కొత్త టాటా కర్వ్ ఎస్‌యూవీ కారును అందించింది. వైభవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాట్నాలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరయ్యాడు. అక్కడ కొత్త షోరూమ్ ప్రారంభోత్సవం అనంతరం టాటా కర్వ్ కారును అధికారికంగా స్వీకరించాడు. ఈ సందర్భంగా వైభవ్ ఆనందం వ్యక్తం చేశాడు. టాటా కర్వ్ ఎస్‌యూవీ ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర సుమారు రూ. 9.66 లక్షల నుంచి ప్రారంభమై రూ. 18.85 లక్షల వరకు ఉంటుంది. ఇది పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వేరియంట్లలో అందుబాటులో ఉంది. టాటా కర్వ్ ఈవీ ధరలు రూ. 17.49 లక్షల నుంచి రూ. 22.24 లక్షల వరకు ఉంటాయి. ఈ ఎస్‌యూవీ స్మార్ట్, ప్యూర్+, క్రియేటివ్, అకంప్లిషెడ్ వంటి పలు వేరియంట్లలో లభిస్తుంది. టాటా కర్వ్‌లో 1.2 లీటర్ రేవోట్రాన్ పెట్రోల్, 1.2 లీటర్ హైపీరియన్ GDI టర్బో పెట్రోల్, 1.5 లీటర్ క్రయోజెట్ డీజిల్ ఇంజిన్ ఆప్షన్లు ఉన్నాయి. ఎలక్ట్రిక్ మోడల్‌లో 45 kWh, 55 kWh బ్యాటరీ ప్యాక్ ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, పానోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జింగ్, 360-డిగ్రీ కెమెరా మరియు లెవల్-2 ADAS వంటి ఫీచర్లు ఉన్నాయి. భద్రత పరంగా కూడా 5-స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించింది.




# టీమిండియాలో ప్రక్షాళన

### నెక్స్ట్ మ్యాచ్‌లో ఆ స్టార్ ప్లేయర్‌కు ఉద్వాసన!



**ఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో టీమిండియా కేవలం 111 పరుగులకే కుప్పకూలడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ముఖ్యంగా ఈ మ్యాచ్‌లో టీమిండియా ఎడమచేతి వాటం బ్యాటర్లు ప్రత్యర్థి ఆఫ్-స్పిన్నర్లను ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఈ దెబ్బతో ఫిబ్రవరి 26న జింబాబ్వేతో జరగబోయే కీలక మ్యాచ్ కోసం టీమ్ మేనేజ్‌మెంట్ జట్టులో రెండు పెద్ద మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

#### ఎవరిపై వేటు పడే అవకాశం ఉందంటే..

వరుసగా నాలుగు మ్యాచుల్లో విఫలమైన యువ ఓపెనర్ అభిషేక్ శర్మను తదుపరి మ్యాచ్‌లో పక్కన పెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. కేవలం లెఫ్ట్-హ్యాండ్ బ్యాటర్లే ఎక్కువగా ఉండటం టీమిండియాకు మైనస్‌గా మారింది. అందుకే వారి స్థానంలో రైట్-హ్యాండ్ బ్యాటర్లను తీసుకురావాలని మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ వంటి వారు సూచిస్తున్నారు. చెన్నై వేదికగా జరిగే జింబాబ్వే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ స్థానంలో సంజూ శాంసన్‌ను ఆడించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కోగల సంజూ రాకతో జట్టు బ్యాటింగ్ బలోపేతం అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత రెండు మ్యాచులకు దూరంగా ఉన్న ఆల్ రౌండర్ అక్షర్ పటేల్‌ను తిరిగి తుది జట్టులోకి తీసుకోవడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఒత్తిడిలో బ్యాటింగ్‌తో పాటు, పొదుపుగా బౌలింగ్ చేయగల అక్షర్ జట్టుకు చాలా అవసరమని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

#### ఇషాన్ కిషన్ పరిస్థితి ఏంటి..

ఈ టోర్నీలో ఇప్పటి వరకు 177 పరుగులతో భారత్ తరపున టాప్ స్కోరర్‌గా ఉన్న ఇషాన్ కిషన్, దక్షిణాఫ్రికాపై మాత్రం డకౌట్ అయ్యాడు. అయినప్పటికీ, అతని గత రికార్డు దృష్ట్యా అతనికి మరో అవకాశం ఇచ్చే ఛాన్స్ ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జింబాబ్వేతో జరగబోయే మ్యాచ్ భారత్‌కు 'డూ ఆర్ డై' లాంటిది. ఎందుకంటే భారత్ ఈ మెగా టోర్నీలో సెమీఫైనల్ రేసులో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడంతో పాటు భారీ రన్ రేట్ సాధించడం కూడా ముఖ్యం. మరి సూర్యకుమార్ యాదవ్ ఎలాంటి మార్పులతో బరిలోకి దిగుతారో వేచి చూడాలి.



# జింబాబ్వే బౌలర్లకు 'రక్తకన్నీరు'

**సిక్సర్లతో విరుచపడ్డ విండిస్ బ్యాటర్లు!**

- టీ20 వరల్డ్ కప్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు.
- సూపర్ 8 మ్యాచ్‌లో వెస్టిండీస్ 254/6 భారీ స్కోరు నమోదు..

**ముంబై:** ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా ముంబైలోని వాంఖేడే స్టేడియంలో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో వెస్టిండీస్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసి.. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరును నమోదు చేశారు. వెస్టిండీస్ బ్యాటింగ్‌లో హెట్మేయర్ కేవలం 34 బంతుల్లోనే 7 ఫోర్లు, 7 సిక్సర్లు కొట్టి 250 స్ట్రైక్‌రేట్‌తో 85 పరుగులు చేసి జింబాబ్వే బౌలర్లను ఓ ఆట ఆడుకున్నాడు. అతనికి తోడుగా రోవ్మాన్ పావెల్ కూడా 35 బంతుల్లో 59 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. చివర్లో రూథర్ఫోర్డ్ (31*), రోమారియో షెఫర్డ్ (21), జాసన్ హోల్డర్ (13) వేగంగా పరుగులు చేసి స్కోరును 250 దాటించారు. వెస్టిండీస్ చివరి 5 ఓవర్లలోనే 75 పరుగులు సాధించడంతో భారీ స్కోర్ ను అందుకుంది. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ నగరవా, బ్లెస్సింగ్ ముజారాబని చెరో రెండు వికెట్లు తీసినా, విండీస్ బ్యాటర్ల దూకుడును అడ్డుకోలేకపోయారు. చూడాలిమరి విండిస్ బౌలర్లను జింబాబ్వే బ్యాటర్లు ఎంతవరకు ఎదురుకోగలరో.

# టీమిండియాకు 2012 ప్రపంచ కప్ గండం

### అప్పట్లాగే నెట్ రన్ రేట్ దెబ్బకొడుతుందా?



**ఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఘోర పరాజయం మూటగట్టుకున్న భారత్, ప్రస్తుతం ఈ మెగా టోర్నీలో చాలా ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఈ ఓటమితో భారత్‌కు సెమీఫైనల్ చేరడం ఒక పెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం టీమిండియా నెట్ రన్ రేట్ -3.800 గా ఉంది. ఇది అభిమానులను తీవ్రంగా ఆందోళన కలిగిస్తుంది.

#### భారత్ ముందున్న మ్యాచులు ఇవే..

సెమీస్ చేరాలంటే టీమిండియా తన నెక్ట్స్ రెండు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితిలో ఉంది. భారత్ ఫిబ్రవరి 26న జింబాబ్వేతో, మార్చి 1న వెస్టిండీస్‌తో తలపడబోతుంది. టీమిండియా సెమీస్ చేరాలంటే ఉన్న ఛాన్స్‌లు ఏమిటంటే.. దక్షిణాఫ్రికా తన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ (జింబాబ్వే, విండీస్) గెలవాలి. అప్పుడు భారత్ తన రెండు మ్యాచ్‌లు గెలిస్తే, రన్ రేట్ తో సంబంధం లేకుండా నేరుగా సెమీస్ కి వెళ్తుంది. ఒకవేళ వెస్టిండీస్ జట్టు.. జింబాబ్వే, దక్షిణాఫ్రికాపై గెలిస్తే.. అప్పుడు భారత్, విండీస్, సౌతాఫ్రికా మూడూ తలో రెండు విజయాలతో సమానంగా ఉంటాయి. అప్పుడు ఎవరి రన్ రేట్ బాగుంటే వారే సెమీస్ కి వెళ్తారు. ప్రస్తుతం భారత్ రన్ రేట్ మైనస్‌లో ఉండటం పెద్ద సమస్యగా మారింది.

#### 2012 నాటి సీన్ రిపీట్ అవుతుందా..

సరిగ్గా 14 ఏళ్ల క్రితం (2012లో) టీమిండియాకు ఇలాగే జరిగింది. అప్పుడు సూపర్-8లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ భారీ తేడాతో ఓడిపోయింది. ఆ తర్వాత పాకిస్థాన్, దక్షిణాఫ్రికాపై గెలిచినప్పటికీ.. ఆస్ట్రేలియా కంటే తక్కువ రన్ రేట్ ఉండటంతో భారత్ సెమీస్ చేరకుండానే ఇంటికి వచ్చేసింది. ఆ టోర్నీలో భారత్ 3 మ్యాచ్‌ల్లో 2 గెలిచినా రన్ రేట్ వల్ల సెమీస్‌కు చేరకుండా తిరిగి రావాల్సి వచ్చింది. పాకిస్థాన్, ఆస్ట్రేలియా మెరుగైన రన్ రేట్‌తో సెమీస్‌కి వెళ్లాయి. ఆ మెగా టోర్నీలో చివరికి వెస్టిండీస్ కప్పు కొట్టింది. సొంత గడ్డపై జరుగుతున్న ఈ టోర్నీలో భారత్ ఒక్క మ్యాచ్ గెలిస్తే సరిపోదు, రన్ రేట్‌ను కూడా భారీగా మెరుగుపరుచుకోవాలి. ముఖ్యంగా వెస్టిండీస్, జింబాబ్వేపై భారీ తేడాతో గెలిస్తేనే సెమీస్ ఆశలు సజీవంగా ఉంటాయని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. లేదంటే 2012 నాటి కథే మళ్లీ పునరావృతం అవుతుందని అంటున్నారు.



# పెళ్లికోసం ఉదయ్‌పూర్‌కు..

టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ- రష్మిక మందన్నా పేర్లు గత కొద్ది రోజులుగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందని ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు వధూవరులుగా పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తరువాత పెళ్లి వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 26న వివాహం జరగనుండగా, వేడుక కోసం ఈ జంట రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరింది. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ వెంట ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ ఉన్నారు. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లిపై వార్తలు జోరందుకున్నాయి. సోషల్ మీడియాలో ఒకే పోస్ట్‌తో పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అభిమానులు ప్రేమగా పిలిచే 'విరోష్' పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని పేర్కొన్నారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు 'విరోష్'. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్" అంటూ ఎమోషనల్‌గా రాసుకొచ్చారు. ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలు, పలువురు రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని సమాచారం. లఅభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ కలల కపుల్ పెళ్లి వేడుక సోషల్ మీడియాలో మరింత సందడి చేయనుంది.

# అల్లువారింట పెళ్లి సందడి

## పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం







అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మరోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్-నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్ -నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు. అక్కడి నుంచి వచ్చాక ఫిబ్రవరి 20న అల్లు అర్జున్ హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులకు, టాలీవుడ్ నటీనటులకు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో రామ్ చరణ్ దంపతులతో పాటు శ్రీలీల, మృణాల్, ఫరియా అబ్దుల్లా మరికొందరు సందడి చేశారు.




# ది ప్యారడైజ్ నుంచి ప్రోమో సాంగ్ విడుదల

నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి పాటను విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. తాజాగా 'ఆయా షేర్' అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. పూర్తి పాట ఫిబ్రవరి 24న రానుంది. అనిరుధ్ అందించిన సంగీతం జోష్ పెంచేలా కనిపిస్తోంది. ఇదిలావుంటే నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

# ఆరా ఆఫ్ ఉస్తాద్ రెండో పాట విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గురించి దర్శకుడు హరీష్ శంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుపుకుంటుంది. ఇందులో భాగంగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.పవన్ కళ్యాణ్ రెండు దశాబ్దాలుగా మెడపై చెయ్యి వేసుకునే మేనరిజాన్ని గుర్తు చేస్తూ, దానికి మాటల రూపం ఇవ్వాలనే ఆలోచనతోనే 'నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ వచ్చిందన్నారు. ఈ హుక్ లైన్ చెప్పగానే డీఎస్పీ ఉత్సాహంగా స్పందించారని తెలిపారు. మాస్ హుక్ లైన్‌లో కూడా ఫిలాసఫీ చెప్పొచ్చని దేవిశ్రీ ప్రసాద్ తనకు కాంప్లిమెంట్ ఇచ్చారని చెప్పారు. ఈ పాటను రచయిత చంద్రబోస్ కేవలం రెండు రోజుల్లో ఎనిమిది గంటల్లో రాశారని వెల్లడించారు. ఇది కేవలం అభిమానంతో రాసిన పాట కాదు. పవన్ కళ్యాణ్ లైఫ్ స్టైల్, ఆయన జర్నీపై అవగాహనతో వచ్చిన పాట. ఆయన వ్యక్తిత్వం, కష్టపడే స్వభావం ఈ పాటలో ప్రతి లైన్‌లో కనిపిస్తుంది. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయనకు విజయాలు రాత్రికి రాత్రే రాలేదు. ఆ ప్రయాణం మొత్తం ఈ పాటలో వినిపిస్తుంది' అని హరీష్ శంకర్ అన్నారు. అభిమానులు పవన్ కళ్యాణ్‌కు పాలాభిషేకం చేస్తారని, కానీ దేవిశ్రీ ప్రసాద్ ఈ పాటతో పాటాభిషేకం చేశారని, చంద్రబోస్ తన సిరాతో సిరాభిషేకం చేశారని ఆయన పేర్కొన్నారు. అయితే పవన్ కళ్యాణ్ డబ్బుకి ఏమాత్రం లొంగని వ్యక్తి అని హరీష్ శంకర్ స్పష్టం చేశారు. 'గబ్బర్ సింగ్' తర్వాత అనేక మంది నిర్మాతలు, కార్పొరేట్ సంస్థలు సినిమాలు, యాడ్స్ కోసం సంప్రదించారని తెలిపారు. 2012లోనే పాన్ ఇండియా అనే పదం లేకపోయినా, ఒక యాడ్ కోసం షారుఖ్ ఖాన్ తీసుకునేంత రెమ్యూనరేషన్‌ను పవన్ కళ్యాణ్‌కు ఆఫర్ చేశారని చెప్పారు. అయితే ఆరోగ్యానికి హానికరమైన లేదా చిన్నపిల్లలకు మంచిది కాని ఉత్పత్తులకు ప్రచారం చేయడం ఇష్టం లేక ఆయన కొన్ని కోట్ల రూపాయల యాడ్స్‌ను తిరస్కరించారని వెల్లడించారు. ఇక సినిమాలో సాంగ్స్, డాన్స్, డైలాగ్స్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్, డ్రెస్సింగ్ స్టైల్, హెయిర్ స్టైల్ అన్నీ ఉంటాయి. 2 గంటల 35 నిమిషాల సినిమాలో దాదాపు 2 గంటలు పవన్ కళ్యాణ్‌ను తృప్తిగా చూస్తారు' అని హరీష్ శంకర్ నమ్మకం వ్యక్తం చేశారు.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131